Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 11.04.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 45 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# పొత్తుతో...

- కలగాపులగంగా మారిన తెలుగుదేశం
- బీజేపీ వల్ల కొత్త ప్రయోజనం లేదు
- సీమాంధ్రలో మోడీ ప్రభావం నామమాత్రం



చంద్రబాబు వేటాడి వెంటాడి, బ్రతిమలాడి కాళ్ళా వేళ్లా పడి బీజేపీతో పొత్తు ఎందుకు పెట్టుకున్నాడో తెలుగుదేశం నాయకులకు ఎంత ఆలోచించినా అర్థం కావడం లేదు.

# 'దేశం' చిత్తు

పొత్తు కోసం చంద్రబాబు నాలుగడుగులు ముందుకేస్తే బీజేపీ వైపు నుండి ఒక అడుగు కూడా వేయలేదు. చంద్రబాబుతో పొత్తు కోసం బీజేపీ జాతీయ నాయకత్వం ప్రయత్నించలేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నాయకులైతే అసలు ఇష్టం చూపలేదు. తెలుగుదేశంతో పొత్తు అన్నాక తెలంగాణలో వున్న బీజేపీ నాయకులు ఎంత రచ్చ చేసారో చూసాం. ఈసారయితే బీజేపీ వాళ్లు చంద్రబాబును ఓ కుష్టు రోగిలా అంటరానివాడి మాదిరిగా చూసారు. చచ్చీ చెడి బీజేపీతో పొత్తు పెట్టుకున్నందుకు చంద్రబాబుకు ఒరిగేదేమన్నా ఉందా అంటే అదీ లేదు. బీజేపీతో పొత్తువల్ల తెలంగాణలో ఏదన్నా లాభముందేమోగాని సీమాంధ్రలో మాత్రం ఖచ్చితంగా నష్టమే జరుగుతుంది. ఆ నష్టం తాలూకు ఛాయలు ఇప్పుడు మన కళ్లముందు కనపడుతున్నాయి కూడా!

తెలంగాణలో దాదాపు సగం లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు బీజేపీకి కేటాయించడంతో ఇప్పటివరకు ఆ స్థానాలను కనిపెట్టుకుని పనిచేసుకుంటున్న తెలుగుదేశం నాయకులకు గొంతులో వెలక్కాయ పడ్డట్లయ్యింది. తమ స్థానాలను బీజేపీకివ్వడంతో జీర్ణించుకోలేక వీళ్లు చాలామంది రెబల్స్‌గా రంగంలోకి దిగారు. సీమాంధ్రలో అయితే టీడీపీ నాయకుల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. ఆ పార్టీలో వున్న

(మిగతా 10వ పేజీలో)





## తప్పదంటే...
# తప్పకోవడమే!

నెల్లూరు లోక్‌సభ నుండి పోటీ చేయడానికి తెలుగుదేశంపార్టీకి అభ్యర్థే కరువైన పరిస్థితుల్లో వెదకబోయిన తీగ కాలికి తగలినట్లుగా దొరికాడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి. కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలోకి జంప్ చేసిన ఆయన నెల్లూరు లోక్‌సభకు పోటీచేయడానికి నిర్ణయించుకున్నాడు.

అయితే ఆదాలది ఒక రకంగా సాహసవంతమైన నిర్ణయమే. ఎందుకంటే ఒకటిన్నర ఏడాది క్రితం జరిగిన నెల్లూరు లోక్‌సభ ఉపఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డికి దాదాపు 3లక్షల మెజార్టీ వచ్చింది. తెలుగుదేశంకయితే డిపాజిట్ కూడా రాలేదు. ఈ పరిస్థితిలో పోటీ చేయడం సాహసమే. ఈరోజుకు కూడా జగన్ గాలి వుంది.

(వివరాలు 10వ పేజీలో)

## ... గూటికి ...

(వివరాలు 3వ పేజీలో)



## జనం జగన్ సైడ్...
# వార్ వన్‌సైడ్!

వయస్సు తక్కువే కావచ్చు... అతని రాజకీయ వ్యూహం మాత్రం తక్కువైనది కాదు. పార్టీని పెట్టి రెండేళ్లే అయ్యిందొచ్చు... కాని అతని ముందుచూపు ముందు *125*ఏళ్ల వయసున్న పార్టీలు కూడా దిగదుడుపే. అన్నీతానై అంతా తానై ఒంటిచేత్తో పార్టీని నడిపిస్తున్న వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముందు వివిధ పార్టీల సీనియర్ నాయకులు కూడా దిగదుడుపే!

సీమాంధ్ర, తెలంగాణలోని వివిధ పార్టీల తీరును చూస్తే సీట్ల గొడవలు, అంతర్గత కలహాలు లేని పార్టీ అంటూ కనిపించడం లేదు. ఆఖరకు క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే బీజేపీలో సైతం సీట్ల గొడవలు వెలుగుచూస్తున్నాయి. కాంగ్రెస్‌లో చూస్తే తెలంగాణలో నాయకులకు టిక్కెట్లు

(వివరాలు 10వ పేజీలో)



# టీడీపీకి బీజేపీ షాక్

- కేడర్ లేని చోట బీజేపీకి సీటు
- రెండు పార్టీలు దెబ్బతినే అవకాశం
- సోమిరెడ్డి ఆశలపై నీళ్ళు





తెలుగుదేశం, బీజేపీల పొత్తు ఓట్ల పరంగా లాభం చేకూర్చడమేమోగాని జిల్లాలో మాత్రం రెండు పార్టీలకు నష్టం కలిగించేలా ఉంది. బీజేపీకి కేటాయించిన నెల్లూరురూరల్ నియోజకవర్గం మూలంగా తెలుగుదేశంపార్టీకి నెల్లూరు లోక్‌సభ పరిధిలో నష్టం కలిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. లీడర్లు, కేడరు లేని రూరల్ నియోజకవర్గాన్ని బీజేపీకి ఎందుకు కేటాయించాలో తెలియక తెలుగు తమ్ముళ్ళు తలలు పట్టుకున్నారు.

బీజేపీకి నెల్లూరురూరల్ సీటిచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి పట్టుబట్టి ఈ సీటు తెచ్చుకున్నట్లు సమాచారం. ఈ సీటులో బీజేపీ పోటీ చేయడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నది తేటతెల్లం. ఇక్కడ బీజేపీకి కేడర్ లేదు. నెల్లూరు నగరపరిధిలో కొచ్చే నాలు గైదు డివిజన్‌లలో తప్పితే నియోజకవర్గం మొత్తం మీద గట్టిగా పనిచేసే కార్యకర్తలు కూడా లేరు. ఈ సీటులో బీజేపీ పోటీ చేయడమంటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఖర్చును తగ్గించడమే.

జిల్లాలో బీజేపీకి ఎక్కడన్నా కేడర్ ఉందంటే అది నెల్లూరు నగరం, ఆత్మకూరు, గూడూరు, కావలి నియోజకవర్గాలలో మాత్రమే. గూడూరు, కావలి తెలుగుదేశం సిటింగ్ ఎమ్మెల్యేలున్నారు కాబట్టి వదులుకోలేరు. నెల్లూరు నగరానికి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిని దాదాపు ఖరారు చేసేసారు. ఇక మిగిలింది ఆత్మకూరు. ఇక్కడ పార్టీకి బలమైన కేడర్ ఉంది. 1985, 89ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఇక్కడ గెలుపు అంచులదాకా వచ్చి ఓడిపోయారు. ఎలాగూ ఇక్కడ తెలుగుదేశంకు బలమైన నాయకత్వం లేదు. కాబట్టి ఈ సీటును బీజేపీకి ఇచ్చి ఉన్నా పెద్ద తేడా ఉండేది కాదు.

బీజేపీకి నెల్లూరురూరల్ ఇవ్వడం వల్ల ఆ ప్రభావం నెల్లూరు లోక్‌సభపై పడే అవకాశముంది. తెలుగుదేశంపార్టీ లోక్‌సభ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి 7అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బలమైన అభ్యర్థులను పెట్టుకునే పనిలో ఉన్నారు. ఈ లోక్‌సభ పరిధిలో బీజేపీకి సీటు ఇవ్వకూడదని ఆయన భావించారు. నెల్లూరురూరల్ నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని దించితే గట్టిపోటీ (మిగతా 10వ పేజీలో)



## వైకాపాలోకి దినేష్‌రెడ్డి

### మల్కాజ్‌గిరి నుండి పార్లమెంటు బరిలోకి

రాష్ట్ర మాజీడిజిపి వేణుంబాక దినేష్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆయన చేరిందే తడవు మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుండి ఆయనను పార్టీ అభ్యర్థిగా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం తాళ్లపూడి గ్రామానికి చెందిన వేణుంబాక దినేష్‌రెడ్డిది జమీందారీ కుటుంబ నేపథ్యం. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే పెద్దపెద్ద రాజకీయ కుటుంబాలతో ఆయనకు బంధుత్వం వుంది. ఐపిఎస్ హోదాతో పోలీసుశాఖలో ప్రవేశించిన ఆయన ఏఎస్పీ నుండి డిజిపి వరకు ఆ శాఖలో అన్నిరకాల పదవులు నిర్వహించారు. ముఖ్యంగా చంద్రబాబు సీఎంగా వున్నప్పుడు అంతగా ప్రాధాన్యతలేని స్థానాలలో పనిచేసారు. వైయస్ సీఎం అయ్యాక దినేష్‌రెడ్డి కీలక విభాగాలలో పనిచేసారు. కిరణ్ సీఎంగా వున్నప్పుడు సీనియర్లను కూడా పక్కన పెట్టి దినేష్‌రెడ్డిని డిజిపి చేసారు. అయితే చివరిలో ఇద్దరికీ బెడిసింది. తన పదవీ కాలాన్ని పొడిగించలేదని చెప్పి కిరణ్‌పైనే దినేష్‌రెడ్డి బహిరంగ విమర్శలు చేసాడు. ఈ సంఘటనలో దినేష్‌రెడ్డే తన స్థాయికి తగ్గట్లు ప్రవర్తించలేదనే విమర్శలొచ్చాయి. పదవీ విరమణకు దగ్గర్లో ఉన్నప్పుడే ఆయన రాజకీయాలవైపు చూసారు. మొదట వైకాపాలో చేరుతారని, ఒంగోలు నుండి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. తర్వాత బీజేపీలో చేరి ఒంగోలు నుండి పోటీ చేస్తారనే వార్తలొచ్చాయి. చివరకు ఆయన వైకాపాలోనే చేరి మల్కాజ్‌గిరి నుండి పోటీ చేస్తున్నారు. ఈ పార్లమెంటు స్థానం తెలంగాణలోదే అయినా సగం మంది ఓటర్లు సీమాంధ్రులే. ఇక్కడ నుండే లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ కూడా పోటీ చేస్తున్నారు. బీజేపీ, టీఆర్ఎస్, కాంగ్రెస్‌లు గట్టి అభ్యర్థులనే దింపుతున్నాయి. ఇది కంటోన్మెంట్ ఏరియా, పోలీసుల ఓట్లను నమ్ముకుని దినేష్‌రెడ్డి దిగుతున్నాడు. మరి వాళ్లెంత వరకు ఆదరిస్తారో చూడాలి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

- వెల్లివిరిసిన చైతన్యం

## పోటెత్తిన ఓటరు జనం



ఓటు విలువ పెరగబట్టో, ఓటర్లలో చైతన్యం పెరగబట్టో ఏమోగాని ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఓటర్లు పోటెత్తినట్లు వచ్చారు. ఈ నెల 6వ తేదీన జరిగిన తొలిదశ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు పోలింగ్ కేంద్రాలలో క్యూలు కట్టి మరీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7గంటల నుండే పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరి నిలిచారు. తొలిదశలో ఆదివారం 21 జడ్పీటీసీలకు, 258ఎంపీటీసీలకు పోలింగ్ జరిగింది. వీటిలో 7,04,773 మంది ఓటర్లకు గాను 5,50,660మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 77.88శాతంగా పోలింగ్ నమోదైంది. రెండు మూడు చోట్ల స్వల్పఘర్షణలు మినహా మిగిలిన అన్ని చోట్ల పోలింగ్ ప్రశాంతంగ జరిగింది. ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, కోవూరు నియోజకవర్గాల పరిధిలోని జడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు తొలిదశలో ఎన్నికలు జరిగాయి. ఈ నెల 11న గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు రెండో దశ ఎన్నికలు నిర్వహించనున్నారు.

### మండలాల వారీగా పోలింగ్ వివరాలు

| మండలం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| ఆత్మకూరు | 25,590 | 20,245 | 82.33 |
| అనంతసాగరం | 32,846 | 24,936 | 75.92 |
| ఏఎస్‌పేట | 26,144 | 21,271 | 81.36 |
| మర్రిపాడు | 35,472 | 24,543 | 69.17 |
| సంగం | 33,755 | 27,217 | 80.63 |
| ఉదయగిరి | 29,044 | 20,540 | 70.72 |
| సీతారామపురం | 17,665 | 17,878 | 72.90 |
| వింజమూరు | 28,992 | 22,327 | 77.01 |
| కావలి | 37,929 | 33,506 | 88.34 |
| బోగోలు | 35,462 | 28,777 | 81.15 |
| అల్లూరు | 39,004 | 31,679 | 81.22 |
| దగదర్తి | 29,597 | 23,678 | 80.00 |
| జలదంకి | 34,818 | 29,536 | 84.84 |
| కలిగిరి | 32,921 | 27,623 | 83.78 |
| కొండాపురం | 31,985 | 24,913 | 77.89 |
| వరికుంటపాడు | 24,502 | 14,814 | 60.46 |
| దుత్తలూరు | 19,183 | 14,635 | 76.29 |
| బుచ్చిరెడ్డిపాళెం | 61,104 | 47,661 | 78.00 |
| కోవూరు | 56,997 | 41,511 | 72.83 |
| కొడవలూరు | 36,200 | 28,705 | 79.30 |
| విడవలూరు | 36,517 | 29,670 | 81.25 |
| మొత్తం | 7,04,773 | 5,50,660 | 77.88 |



- న్యాయస్థానానికి చెలగాటం
- అభ్యర్థులకు టెన్షన్ సంకటం

## టెన్షన్.. టెన్షన్...

**పంచాయితీరాజ్ ఎన్నికల ఫలితాలతో పాటు మున్సిపల్ ఎన్నికల ఫలితాలను కూడా మే7వ తేదీ తర్వాతే ప్రకటించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశంతో అభ్యర్థులు కుదేలయ్యారు. మే7 దాకా వీళ్లిక టెన్షన్‌తో నిద్రలేని రాత్రిళ్లు గడపక తప్పేటట్లు లేదు. ఫలితాలు ఇప్పుడు ప్రకటించకుండా సార్వత్రిక ఎన్నికల తర్వాత ప్రకటించే దానికి ఈ ఎన్నికలను అప్పుడే పెట్టేసుంటే పోలేదా అని పోటీలో వున్న అభ్యర్థులు నిట్టూరుస్తున్నారు.**

న్యాయమూర్తులకు ప్రాక్టికల్ సమస్యలు తెలియవు. వాళ్ల దృష్టి కోణం అంతా రాజ్యాంగ పరిధిలోనే ఉంటుంది. పోటీలో వున్న అభ్యర్థి డిపాజిట్ ధరావత్తు చెల్లించి ఉండడంతో పాటూ ఎన్నికల కమీషన్ పరిమితి విధించిన లక్షో, రెండులక్షలో ఖర్చుపెట్టి ఉంటారనే లెక్కలో ఉంటారు. కాని ఇక్కడ లెక్కలు వేరేవిధంగా ఉంటాయి. అధికార ఖర్చు లక్ష అయితే అనధికార ఖర్చు కోట్లలో ఉంటుంది. కోట్లు ఖర్చుపెట్టిన అభ్యర్థులు టెన్షన్‌తో ఫలితాల కోసం ఎదురుచూస్తుంటారు. స్థానిక సంస్థల పోలింగ్‌కు, కౌంటింగ్‌కు పెద్ద గ్యాప్ ఉండదు. పోలింగ్ జరిగిన రెండోరోజే ఫలితాలను ప్రకటించేస్తుంటారు.

కాని ఈసారి మాత్రం మున్సిపల్, పంచాయితీరాజ్ ఎన్నికల ఫలితాల వెల్లడికి సార్వత్రిక ఎన్నికలు అడ్డుగా నిలిచాయి. స్థానిక ఎన్నికల ఫలితాల ప్రభావం సార్వత్రిక ఎన్నికలపై పడుతుందని, కాబట్టి ఈ ఫలితాలను ఆపేయాలని నెల్లూరు జిల్లాకు చెందిన ఓ న్యాయవాది కోర్టును ఆశ్రయించడంతో ఫలితాలపై పీటముడి పడింది. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా స్థానిక ఎన్నికలను వాయిదాల మీద వాయిదా వేసుకుంటూ వచ్చింది. ఇంతకాలంగా వాయిదా వేసుకుంటూ వచ్చారు కాబట్టి సార్వత్రిక ఎన్నికల తర్వాతే స్థానిక ఎన్నికలను పెట్టేసి ఉంటే సరిపోయేది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీకి అనుకూలంగానే స్థానిక సంస్థల ఫలితాలు వచ్చేవి. ప్రతిపక్షం తరపున నాయకులు పోటీ చేయడానికి ముందుకొచ్చేవాళ్లు కాదు. అధికారపార్టీ అభ్యర్థులకు ఖర్చు తప్పేది. కాని ఇప్పుడు ఎన్నికలు పెట్టడంవల్ల అన్ని పార్టీల అభ్యర్థులు దండిగా ఖర్చు పెట్టుకున్నారు. తీరా ఫలితాలు వాయిదా అనేసరికి దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒకట్రెండు రోజులు టెన్షన్ భరించాలంటేనే కష్టంగా ఉంటుంది. అలాంటిది స్థానిక సంస్థల అభ్యర్థులు మరో నెల రోజులు టెన్షన్‌తో గడపాలి.

## పోరుకు సిద్ధమైన సీపీఎం

ప్రతి ఎన్నికల్లోనూ ఏదో ఒక పార్టీతో పొత్తుపెట్టుకుని ఒకటి అరా సీట్లలో పోటీ చేసే సీపీఎంకు ఈ ఎన్నికలలో సరైన తోడు దొరకలేదు. తెలుగుదేశంపార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుని పోయింది. వైయస్సార్ కాంగ్రెస్‌తోనన్నా పొత్తు కుదురుతుందనుకుంటే అదీ లేదు. దీంతో సొంతంగానే పోటీ చేయడానికి సీపీఎం నిర్ణయించుకుంది. జిల్లాలో నెల్లూరు నగరంతో పాటూ నెల్లూరురూరల్, సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట స్థానాలలో పోటీ చేయాలని సీపీఎం నాయకత్వం నిర్ణయించుకుంది. అయితే ఎక్కడ ఎవరు అభ్యర్థులనేది ఇంకా నిర్ణయం కాలేదు. జిల్లా రాజకీయాలలో సీపీఎం ప్రభావం చాలా తక్కువేనని చెప్పవచ్చు. గడచిన మూడు దశాబ్దాల కాలాన్ని తీసుకుంటే మనకు తెలుగుదేశం అలయన్స్‌లో అల్లూరు నుండి సీపీఎం ఎమ్మెల్యేగా పనిచేసిన జక్కా వెంకయ్య మాత్రమే కనిపిస్తారు. కోవూరు, నెల్లూరు నగరంలో సీపీఎంకు బలమైన కేడర్ ఉన్నప్పటికి అది సొంతంగా పార్టీ అభ్యర్థులను గెలిపించగల స్థాయిలో లేదన్నది మాత్రం వాస్తవం.

# నెల్లూరు నగరం సీటు...
# దేశంలో తీవ్రమైన ఫైటు





నెల్లూరు నగరం తెలుగుదేశం సీటు విషయంలో అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి. నెల్లూరు సిటీ సీటిస్తామనే హామీతోనే ప్రస్తుత ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కాంగ్రెస్‌ను వదిలేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రబాబు కూడా ఆయనకు హామీ ఇచ్చే పార్టీలోకి తీసుకున్నారు. నెల్లూరు లోక్‌సభ తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నగరం నుండి ముంగమూరు వైపే మొగ్గుచూపారు. ముంగమూరును పార్టీలోకి లాక్కొచ్చింది కూడా ఆదాలే! వచ్చే ఎన్నికల్లో పోటీకి ముంగమూరు సమాయత్తం అయ్యారు.

మరోపక్క నెల్లూరు నగరం సీటు నాదేనంటూ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నామినేషన్‌కు కూడా సిద్ధపడుతున్నాడు. ఈ సీటు విషయమై బాలకృష్ణ తనకు గ్యారంటీ ఇచ్చాడని, ఈ సీటును తనకివ్వకపోతే రెబల్‌గా అయినా పోటీ చేస్తానంటున్నారు. ఎంతోకాలంగా పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్లకు కాకుండా కాంగ్రెస్ నుండి కొత్తగా వచ్చిన వాళ్లకు సీట్లెలా ఇస్తారని ఆయన వాదన. అయితే ముంగమూరు ఇవేమీ పట్టించుకోకుండా తనకు హామీ ఇచ్చింది చంద్రబాబు కాబట్టి కోటంరెడ్డి శీనయ్య వ్యవహారం ఆయనే చూసుకుంటాడులే అనే ఉద్దేశ్యంతో తన పని తాను చేసుకుపోతున్నాడు.

# ఆనంను వదలను.. పోటీలోకి కదలను



నెల్లూరు లోక్‌సభ తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఆత్మకూరు పెద్ద సమస్యగా మారింది. ఇక్కడ పార్టీ అభ్యర్థిగా గూటూరు కన్నబాబు సరిపోవడం లేదు. ఆయన అభ్యర్థి అయితే ఓడిపోవడం ఖాయం. ఆ ప్రభావం లోక్‌సభ మీద కూడా పడుతుంది. ఈ ఆలోచనతోనే ఆయన ఆత్మకూరు తెలుగుదేశంకు బలమైన అభ్యర్థుల వేట ప్రారంభించాడు. ఆయన వేటలో బొల్లినేని భాస్కర్ రావు, బొల్లినేని శీనయ్యలు తగిలారు గాని, వారివల్ల పెద్దగా ఉపయోగం లేదనుకున్నారు. ఎందుకంటే వాళ్లు కమ్మ సామాజిక వర్గానికి చెందినవాళ్లు. ఆత్మకూరులో వున్న కమ్మ ఓటర్లు ఎవరు పోటీ చేసినా తెలుగుదేశంకే ఓట్లేస్తారు. ఓట్లు చీల్చాల్సింది రెడ్డి సామాజికవర్గం నుండి. ఈ అన్వేషణలో ఆయన ఆలోచనకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తట్టాడు. ఆర్థికంగానే కాదు వ్యక్తిత్వంలో, నమ్మకంలో శక్తిమంతుడు. వివాదరహితుడు. నలుగురినీ దగ్గరకు చేర్చుకోగల స్వభావమున్న మనిషి. ఆయన ఆత్మకూరు అభ్యర్థి అయితే అనంతసాగరం, ఆత్మకూరు, ఏ.ఎస్.పేట మండలాలలో పార్టీని పటిష్టం చేయడంతో పాటు, కాంగ్రెస్‌ను వదిలిపోతున్న రెడ్డి వర్గం కేడర్‌ను పట్టుకోవచ్చునని ఆలోచించారు. ఈ ప్రతిపాదనను మెట్టుకూరుకు పంపించారు. అయితే ఈ ప్రతిపాదనను మెట్టుకూరు ధనుంజయరెడ్డి సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తుంది. కష్టమైనా నష్టమైనా తాను ఆనం రామనారాయణరెడ్డితోనే ఉంటానని, ఆయనను వదిలేది లేదని స్పష్టం చేసినట్లు సమాచారం.

అయితే ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నుండి పోటీ చేయకుంటే మెట్టుకూరును దించడం సులభమవుతుందని, ఆనంను ఒప్పించే మెట్టుకూరును 'దేశం' అభ్యర్థిగా నిలపొచ్చని తెలుగుదేశం నాయకుల ఆలోచన. ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది.

# ఆర్యవైశ్య మహాసభ స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న తిరివీధి ప్రకాశరావు

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మరియు జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంయుక్త ఆర్థిక సహకారంతో జిల్లాల్లో నలుగురు విద్యార్థులకు 2వేల రూపాయల వంతున స్కాలర్ షిప్స్ అందజేశారు. మహాసభ అధ్యక్షులు కాళ్లకూరి శ్రీరామనాగేశ్వరరావు ఈ స్కాలర్‌షిప్ చెక్కులను పంపగా మహాసభ అధికార ప్రతినిధి తిరివీధి ప్రకాశరావు బండారు కార్తీక్, లోనికా, హారిక, జి.లోకేష్ అనే విద్యార్థులకు వీటిని అందజేశారు.

# వైకాపాలో చేరిన సుధీర్



నెల్లూరుసిటీబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ కొణిదల సుధీర్, ఆయన అనుచరులు వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి సమక్షంలో ఈనెల 9న వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

# వైకాపా గూటికి వంటేరు



జగన్ సమక్షంలో వైకాపాలో చేరిన వంటేరు వేణుగోపాలరెడ్డి

కావలి మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈనెల 9వతేదీన హైదరాబాద్‌లో వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన వైకాపాలో చేరడం జరిగింది. ఆయన చేరికతో కావలిలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మరింత బలం పుంజుకున్నట్లయ్యింది.

వంటేరు వేణుగోపాలరెడ్డి 1994లో ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చారు. ఆ ఎన్నికల్లో కావలి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసారు. తెలుగుదేశం సీటు రాలేదని గొట్టిపాటి కొండపనాయుడు ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓట్లు చీల్చడంతో వంటేరు 7వేల ఓట్ల తేడాతో కలికి యానాదిరెడ్డి చేతిలో ఓడిపోవడం జరిగింది. ఆ తర్వాత 1999ఎన్నికల్లో కావలి నుండే మళ్ళీ పోటీచేసి కలికి యానాదిరెడ్డిపై విజయం సాధించారు. 2004ఎన్నికల్లో చంద్రబాబు కావలి సీటును ఆయనకు నిరాకరించారు. మాదాల జానకిరాంను ఇక్కడ నిలబెట్టారు. వంటేరు సహకారం లేక ఆ ఎన్నికల్లో మాదాల ఓడిపోయాడు. ఆ తర్వాత కావలి పౌరసేవా సమితిని ఏర్పాటు చేసిన వంటేరు మున్సిపల్ ఎన్నికల్లో సొంతంగా అభ్యర్థులను నిలబెట్టారు. 2009ఎన్నికలప్పటికి మళ్ళీ సర్దుకుని నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసారు. వై.యస్. ప్రభావంతో ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. ఒకటిన్నర ఏడాది క్రితం నెల్లూరు లోక్‌సభకు ఉపఎన్నికలు జరిగితే, తెలుగుదేశం నుండి పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోతే మళ్ళీ వంటేరే దిక్కయ్యాడు. ఆ ఎన్నికల్లో ఆయనకు డిపాజిట్ కూడా దక్కలేదు. తెలుగుదేశంలో వుండి ఇన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్నా పార్టీ నుండి కనీస సానుభూతి లేదనే అసంతృప్తి వంటేరులో వుంది. అందుకే ఆయన ఇక తెలుగుదేశంలో ఉండలేక వైకాపాలోకి దూరారు.

# వైభవంగా శ్రీ మహాలక్ష్మియాగం



అంకురార్పణతో మహాయజ్ఞాన్ని ప్రారంభిస్తున్న శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి



వివిధ దేవతల వేషధారణలతో చిన్నారులు

లోకకల్యాణం కోసం నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 7 నుంచి వారం రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మీయాగమునకు సంబంధించి మాగుంట లే అవుట్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి శోభాయాత్రను అతి వైభవంగా నిర్వహించారు. అనంత శ్రీవిభవాషిత శ్రీ మత్సర మహంనేత్రాది త్రిదండి శ్రీరామచంద్రరామానుజ జీయర్‌స్వామి నేతృత్వంలో అలహాబాద్‌కు చెందిన నృసింహరామానుజ జీయర్ స్వామిజీ, విజయవాడకు చెందిన సంపత్‌కుమార్ రామనుజ జీయర్‌స్వామిజీల పర్యవేక్షణలో వందమంది వేదపండితులు విశేషపూజలను నిర్వహించి ఈ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో గుజరాత్, మహారాష్ట్ర, బీహార్, హర్యానా, మణిపురి, ఒడిశా, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వార్షిక కళాకారులు నృత్యాలు, కోలాటాలు, పండరిభజనలు, వేషధారణతో దారి పొడవునా కోలాహల వాతావరణం నెలకొనేలా చేసారు. ముందుగా నిలిచిన అశ్వరథంపై భూ, గోదా దేవీసమేత గోవింద పెరుమాళ్ళు, తదుపరి రథంపై శ్రీ లక్ష్మీ నారాయణస్వామి, మిగిలిన రెండు రథాలపై పసుపుకుంకుమతో నిండిన పవిత్ర జలాల గంగాళాలతో స్వాములు కూర్చుని శ్రీ లక్ష్మీ నామస్తోత్ర పారాయణం చేస్తూ పాల్గొన్నారు. శ్రీ మహాలక్ష్మీ నామాలు గోవింద నామాలు ఉచ్ఛరిస్తూ వందలాది మంది భక్తులు పవిత్ర కుంకుమతో కూడిన కళశాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. 8వతేదీ ఉదయం 8గంటలకు శ్రీ భూదేవి, గోదాదేవి సమేత శ్రీ గోవింద పెరుమాళ్ళు స్వామికి 108దివ్య కలశాలతో అభిషేకం, మధ్యాహ్నం 2గంటలకు మృత్యం గ్రహణ పూజలు, సాయంత్రం 6గంటలకు అంకురార్పణ చేసి శ్రీ మహాలక్ష్మి యాగమహోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. 9వతేదీ అగ్నిప్రతిష్ట, చతుస్థానార్చన, సుదర్శనవేష్టిలు నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు ఈ మహాయజ్ఞంలో పాల్గొంటున్నారు.






## ప్రాక్టికల్‌గా ఆలోచించాలి

న్యాయస్థానాలు వాస్తవ పరిస్థితులను ప్రాక్టికల్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. సార్వత్రిక ఎన్నికలప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టమన్నది న్యాయస్థానమే. మళ్ళీ వాటి ఫలితాలను వెల్లడించవద్దన్నదీ న్యాయస్థానమే. ఫలితాలు వెల్లడించని దానికి ఇంత హడావిడిగా ఎన్నికలు జరపడమెందుకు? ఆ ఎన్నికలేవో సార్వత్రిక ఎన్నికల తర్వాతే పెట్టొచ్చుగా? అప్పటిదాకా అభ్యర్థులకు టెన్షన్ అవసరమా?

కనుపూరు మురళీరాజు, నెల్లూరు.

## ప్రజలు మారాలి

ఓటును అమ్ముకోవడమంటే మానాన్ని, ఆత్మాభిమానాన్ని అమ్ముకోవడమేనని తెలుసుకోవాలి. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు రాజకీయ మార్కెట్‌లో అమ్మకపు వస్తువుగా మారడం సిగ్గుచేటు. మన ఓటును కొంటున్న నాయకులు రేపు మనల్ని అమ్మకానికి పెడతారు. ఓటును అమ్ముకోవడమంటే దేశానికి ద్రోహం చేయడమే!

సి.టి.దాస్, కావలి.

## ఇదేనా లౌకికవాదం

జామా మసీదు ఇమామ్ బుఖారితో సోనియాగాంధీ సమావేశం కావడం, ఆయన కాంగ్రెస్‌కు ఓట్లేయండంటూ ముస్లింలకు పిలుపునివ్వడం ఏ లౌకిక భావం క్రిందకు వస్తుందో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ లౌకిక వాదం ముస్లింలను ప్రసన్నం చేసుకోవడమేనా? అసలు మతాధిపతులు ఫలానా పార్టీకే ఓట్లెయమని చెప్పడం సబబేనా? హిందూ పీఠాధిపతులు, క్రిస్టియన్ మతాధిపతులు ఇలా ప్రత్యక్షంగా ప్రజలకు పిలుపునిస్తే ఈ దేశం మతాల వారీగా చీలిపోదా?

సి.రాజీవి, నెల్లూరు.

## జగన్, వైయస్ కాలేడు

వై.యస్. ప్రజలకు ఎంతో మేలు చేసారు. కాని జగన్ ఆయనలా పరిణితి చెందిన నాయకుడు కాదు. వై.యస్. ఏనాడు ఓ మతానికి ప్రాధాన్యతనివ్వలేదు. కాని జగన్ ఓ మతానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాడు. ఇది మంచిది కాదు.

షేక్ ఫయాజ్, నెల్లూరు.

## 'ప్రభా'తం

రాజకీయాలకు సిద్ధాంతముండదు. రాజకీయపార్టీలకు సిగ్గుండదు. రాజకీయ నాయకులకు విలువలుండవు. మాట మీద నిలబడడం అనేది రాజకీయాలలో ఏ కోశానా కనిపించదు. పదవుల కోసం అధికారం కోసం ఎంతకైనా దిగజారే నీచ నికృష్టగుణం రాజకీయాలది. అధికారం కోసం నాయకులు నీతిని మరుస్తుంటారు. విలువలను ఏమారుస్తుంటారు. రాజకీయాల్లో పొత్తులనేవి ఎంత ముదనష్టంగా తయారయ్యాయో నేడు కొన్ని పార్టీల మధ్య కుదురుతున్న అవగాహనను చూస్తుంటే అర్థమవుతుంది.

రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ, భారతీయ జనతా పార్టీల మధ్య కుదిరిన పొత్తు కూడా ఇలాంటిదే! ఇది అసంబద్ధమైన అసహజమైన పొత్తు. ఇరు పార్టీల అధిష్టానాలకు తప్పితే ఇరు పార్టీల నాయకులకు గాని, కార్యకర్తలకు గాని ఇష్టంలేని అపవిత్ర కలయిక ఇది. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఏ స్థాయి నుండి ఏ స్థాయికి దిగజారి బీజేపీ నాయకులను బ్రతిమిలాడుకున్నాడో ప్రత్యక్షంగా చూసాము. పొత్తులో భాగంగా బీజేపీకి తెలంగాణలో 8లోక్‌సభ, 47అసెంబ్లీలను అలాగే సీమాంధ్రలో 5లోక్‌సభ, 15అసెంబ్లీలను వదులుకోవాల్సి వచ్చింది. ఇరు ప్రాంతాలలో కూడా బీజేపీకి తాహతకు మించే సీట్లు ఇచ్చారనుకోవచ్చు.

బీజేపీతో పొత్తుతో ఇరు పార్టీల్లోనూ అసమ్మతి చెలరేగింది. మా సీట్లు పోయాయంటే మా సీట్లు పోయాయంటూ ఇరు పార్టీల్లోని నేతలు ఆందోళనకు దిగారు. తమ పార్టీ ఆఫీసుల మీదే దాడులు చేసుకున్నారు. ధర్నాలకు దిగారు. స్వతంత్రులుగా బరిలోకి దిగుతామని హెచ్చరికలు చేస్తున్నారు. ఈ పొత్తు కేవలం చంద్రబాబు పంతంతోనే జరిగింది. తెలుగుదేశంతో పొత్తు పెట్టుకోవడం తెలంగాణ, సీమాంధ్ర బీజేపీ నాయకులకు అసలు ఇష్టం లేదు. తెలంగాణలో బీజేపీ బలపడేందుకు ఇదే అనువైన సమయమని ఆ పార్టీ నాయకుల నమ్మకం. తెలంగాణలో ఎటూ తెలుగుదేశం పతనమవుతుంది. రేపు ఎన్నికల తర్వాత కాంగ్రెస్ - టీఆర్ఎస్‌లు కలిసే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. అప్పుడు బీజేపీనే ప్రతిపక్షమవుతుంది. ఈరోజు ప్రతిపక్షంలో వున్నా ఏదో ఒకరోజు కర్నాటకలో మాదిరిగానే తెలంగాణలోనూ అధికారంలోకి రాగలమన్న ధీమా వారికుంది. కాని ఈరోజు టీడీపీతో పొత్తు పెట్టుకుంటే తెలంగాణలో ఆ పార్టీ వెనుక బీజేపీ వుండిపోవాల్సి వస్తుంది. భవిష్యత్‌లో జరగబోయే దానిని ఊహించే ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు ఆయా జిల్లాల అధ్యక్షులు కూడా టీడీపీతో పొత్తును వ్యతిరేకించారు. అయితే సీమాంధ్రలో మాత్రం ఆ పార్టీతో పొత్తుకు బీజేపీ సీమాంధ్ర నాయకుల నుండి సానుకూల వైఖరే కనిపించింది. సీమాంధ్రలో బీజేపీకి చెప్పుకోదగ్గ బలం లేదు. ఉన్న కాస్తోకూస్తో బలం కూడా పార్లమెంటులో విభజన బిల్లుకు ఆ పార్టీ మద్దతు పలకడంతోనే పోయింది. నరేంద్రమోడీ పట్ల కొన్ని వర్గాల ప్రజలలో అంతో ఇంతో ఆదరణ వుంది. బీజేపీతో పొత్తు వల్ల టీడీపీకి ఏదన్నా లాభముందంటే నరేంద్ర మోడీని చూసి వేసే ఓట్లే!

ఈ దఫా మాత్రం బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు తెగ వెంపర్లాడాడు. బీజేపీ అగ్రనాయకుల చుట్టూ తిరిగిందే తిరిగాడు. పొత్తు ఎక్కడ కుదరకుండా పోతుందోనని భయపడ్డాడు. సీట్ల బేరంలో బాగా తగ్గాడు. బీజేపీ నాయకుల మాటకే ఎక్కువ విలువ ఇచ్చాడు. చంద్రబాబు ఇంతగా తగ్గడానికి కారణం నరేంద్ర మోడీకి ఓటుబ్యాంకు బలంగా ఉందని నమ్మడమే. 1999లో వాజ్‌పేయి సానుభూతి ఓట్లతోనే చంద్రబాబు అధికారంలోకి రాగలిగాడు. నిజంగా ఆరోజు వాజ్‌పేయి ఓటు బాగానే పనిచేసింది. కాని ఈరోజు నరేంద్ర మోడీ ఓటు ఆ స్థాయిలో పనిచేసే అవకాశం లేదు. 1999లో వాజ్‌పేయికి ముస్లింలు, క్రిస్టియన్‌లు కూడా ఓట్లేసారు. ఈరోజు మోడీకి ఆ రెండు వర్గాల వాళ్ళ ఓట్లేసే పరిస్థితి లేదు. అదీ కాకుండా సీమాంధ్రలోనూ, తెలంగాణలోనూ ప్రత్యేక రాజకీయ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. సీమాంధ్రలో జగన్ హవా ఉంది. మైనార్టీ ఓట్లు పూర్తిగా జగన్‌వైపే ఉన్నాయి. మిగిలిన వర్గాలలోనూ మెజార్టీ ఓటర్లు వైకాపా వైపే ఉన్నారు. ఇక్కడ మోడీ కంటే కూడా జగన్ ప్రభావం ఎక్కువగా ఉంది. చంద్రబాబు రెండుకళ్ళ సిద్ధాంతానికి పోయి రాష్ట్ర విభజనకు కారకుడయ్యాడనే ప్రచారం కూడా సీమాంధ్రలో వుంది. రాష్ట్ర విభజనకు కాంగ్రెస్‌తో కలిసి కారణమైన బీజేపీతో టీడీపీ పొత్తును సీమాంధ్రప్రజలు ఆమోదించే పరిస్థితి లేదు. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. తెలుగుదేశం తెలంగాణకు సంపూర్ణ మద్దతు పలకలేదు. సమన్యాయం అంటూ చివర్లో బీజేపీ ద్వారా పార్లమెంటులో విభజన బిల్లును అడ్డుకోవాలని చూసింది. దీంతో తెలంగాణలోని కేడర్ ఆ పార్టీకి దూరమయ్యింది. సమన్యాయం పేరుతో టీ-బిల్లును అడ్డుకోవాలని చూసిన చంద్రబాబుతో పొత్తు ఇక్కడ బీజేపీకి కలిసొచ్చేటట్లు లేదు.

టీడీపీ-బీజేపీల పొత్తు వల్ల ఇరు పార్టీలకు ఆశించిన ప్రయోజనం నెరవేరేటట్లు లేదు. 1985, 1989, 1992, 1999, 2004ఎన్నికల్లో టీడీపీ-బీజేపీలు పొత్తులు కుదుర్చుకునే పోటీ చేసాయి. 1985లో ఎలాగూ ఎన్టీఆర్ సానుభూతి పనిచేసి టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1999లో వాజ్‌పేయి సానుభూతి పనిచేసింది. మిగిలిన ఎన్నికలలో ఈ రెండు పార్టీల పొత్తు బెడిసికొట్టింది. మరి ఈ ఎన్నికల్లో ఫలిస్తుందో, వికటిస్తుందో చూడాలి.

### కలతల కాపురం



బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు తెగ వెంపర్లాడాడు. బీజేపీ అగ్రనాయకుల చుట్టూ తిరిగిందే తిరిగాడు. పొత్తు కుదరదేమోనని భయపడ్డాడు. సీట్ల బేరంలో బాగా తగ్గాడు. బీజేపీ నాయకుల మాటకే ఎక్కువ విలువిచ్చాడు. బాబు ఇంతగా తగ్గడానికి కారణం మోడీకి ఓటుబ్యాంకుందని నమ్మడమే.

## 'అంతర్'జాతీయం

- ఆసియాలోనే అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో భారత్ నుండి సోనియా గాంధీ, నరేంద్ర మోడీ, రాహుల్‌గాంధీలు టాప్ 5లో నిలిచారు. ఆసియాన్ అవార్డ్స్ లిమిటెడ్ వారు ప్రతి ఏటా ఆసియాలోని వందమంది అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాను ప్రకటిస్తుంటారు. ఈసారి చైనా అధ్యక్షుడు జిజిన్‌పింగ్ అగ్రస్థానంలో నిలిచారు. సోనియా రెండో స్థానంలో, నరేంద్ర మోడీ నాలుగోస్థానంలో, రాహుల్‌గాంధీ ఐదో స్థానంలో నిలిచారు. మన్మోహన్‌సింగ్ ఆరోస్థానంలో నిలవడం విశేషం.
- భారత దౌత్యవేత్త దేవయాని వివాదాన్ని ముగిసిన అధ్యాయంగా భావించలేమని భారత్ పేర్కొంది. ఈ వ్యవహారంలో కొన్ని అంశాలు అసంపూర్తిగా ఉండిపోయాయని వాటిని పరిష్కరించాల్సి ఉందని భారత్ పేర్కొంది.
- మతతత్వంపై పోరాటానికి కాంగ్రెస్‌తో చేతులు కలపడం దండగని సీపీఎం నేత సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఢిల్లీలోని జామా మసీదు ఇమాం షాహిబుఖారి కాంగ్రెస్‌కు ఓట్లేయమని ముస్లింలకు పిలుపునివ్వడాన్ని ఆయన తప్పుపట్టారు.
- ఢాకాలోని షేర్‌బంగ్లా స్టేడియంలో ఆదివారం జరిగిన టీ-20 ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక విశ్వవిజేతగా నిలిచింది. భారత్‌పై శ్రీలంక 6వికెట్ల తేడాతో గెలిచి ప్రపంచకప్‌ను చేజిక్కించుకుంది. 2007 నుండి నాలుగుసార్లు టీ-20ఫైనల్స్‌లో దెబ్బతిన్న శ్రీలంక ఈసారి మాత్రం కప్‌ను చేజార్చుకోలేదు.
- ఫెమినా మిస్ ఇండియా 2014 అందాల సుందరి కిరీటాన్ని జైపూర్‌కు చెందిన కోయల్ రాణా దక్కించుకున్నారు. ముంబైలోని యశ్‌రాజ్ స్టూడియోలో ఈ పోటీలు జరిగాయి.
- ఉత్తరనైజీరియాలోని జంఫరాలో సాయుధ దుండగులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో 30మంది మరణించారు. పలువురు గాయపడ్డారు.
- సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌కు చెందిన అత్యాధునిక వెర్షన్‌ను సోమవారం సైన్యం విజయవంతంగా ప్రయోగించింది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ టెస్ట్ రేంజిలో ఈ క్షిపణిని ప్రయోగించారు. 290కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇది ఛేదించగలదు. భారత్, రష్యాలు ఈ క్షిపణిని సంయుక్తంగా రూపొందించాయి.
- న్యూయార్క్‌లోని యేల్ విశ్వవిద్యాలయం-2014ఫెలోస్‌గా నటి నందితాదాస్, గోద్రెజ్ ఇండియా కల్చరల్ ల్యాబ్ అధినేత పరమేష్ సహానీలు ఎన్నికయ్యారు. వీరి ఎంపికతో యేల్ వరల్డ్ ఫెలోస్ బృందంలో భారతీయుల సంఖ్య 15కు చేరుకుంది.
- ప్రముఖ జ్యోతిర్లింగక్షేత్రాలు కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాల ద్వారాలను మేనెల 4, 5తేదీల్లో తెరవనున్నట్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి హరీష్‌రావత్ తెలిపారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- కిరణ్‌కు బాబు, మోడీ సరిరారు. - తులసిరెడ్డి.
**వ్యాఖ్య :- *అంత బరువున్నారా?***

వార్త :- అత్యధిక సీట్లే లక్ష్యంగా కృషి. - బీజేపీ అధ్యక్షుడు హరిబాబు.
**వ్యాఖ్య :- *చంద్రబాబు నుండి సీట్లు తెచ్చుకున్నంత సులభం కాదు గెలుచుకోవడం.***

వార్త :- రాహుల్ కంటే మోడీనే ప్రధానిగా మేలు. - జయప్రకాశ్ నారాయణ.
**వ్యాఖ్య :- *ఏ రాయి అయితేనేం పళ్లూడగొట్టుకోవడానికి అన్నట్లుగా వుంది.***

వార్త :- అవినీతిపై పోరులో అందరికన్నా మేమే మిన్న. - కేరళలో ప్రధాని.
**వ్యాఖ్య :- *అవినీతిపై పోరులోనా? అవినీతి జోరులోనా?***

వార్త :- ఫలితాలకు ముందే కొత్త బంగ్లాకు ప్రధాని.
**వ్యాఖ్య :- *అనుకూలంగా వచ్చినా, వ్యతిరేకంగా వచ్చినా ఇక ఆయన ప్రధాని అయ్యేది లేదుకాబట్టా?***

వార్త :- మోడీ మంచి పాలనాధ్యక్షుడు. - అద్వానీ కితాబు.
**వ్యాఖ్య :- *కాబట్టే కదా మిమ్మల్ని మించిపోయింది.***

వార్త :- పొత్తు ఇరువర్గాలకు లాభమే. - పురంధేశ్వరి.
**వ్యాఖ్య :- *లాభం మాటేమోగాని నష్టం తప్పేటట్లు లేదు... చూడండి!***

వార్త :- దేశ ప్రయోజనాలకే బీజేపీతో పొత్తు. - బాలకృష్ణ.
**వ్యాఖ్య :- *అది కాదులే... తెలుగుదేశం ప్రయోజనానికే?***

వార్త :- ఎన్డీఏకు 300కుపైగా స్థానాలు. - బీజేపీ నేత వెంకయ్యనాయుడు.
**వ్యాఖ్య :- *పోటీ చేసేవి కాదు, గెలిచేవి చెప్పండి.***

వార్త :- పార్టీల పాపాలను కాంగ్రెస్ మోస్తోంది. - కేంద్రమంత్రి జె.డి.శీలం.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్‌ను పాపాల పుట్ట అంటారు!***

వార్త :- కిరణ్ మనసంతా కాంగ్రెస్సే! - ఎంపీ సాయిప్రతాప్.
**వ్యాఖ్య :- *అంటే మళ్ళీ కాంగ్రెస్‌లోకొస్తాడనేగా?***

వార్త :- తాగునీటి సమస్యలేకుండా చూడండి. - గవర్నర్.
**వ్యాఖ్య :- *ఎన్నికలు కదా... మంచినీళ్ల గురించి చాలామంది ఆలోచించరులే!***

వార్త :- యువత, బీసీలకు ప్రాధాన్యం. - రఘువీరారెడ్డి.
**వ్యాఖ్య :- *అసలు టిక్కెట్లు అడిగేవారే లేరుగా... ఎవరికైనా ప్రాధాన్యతనిస్తారు.***

వార్త :- కిరణ్ వస్తానన్నా చేర్చుకోరేమో! - ఆనం రామనారాయణరెడ్డి.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్‌కు అంతసీన్ ఉందా!***

# నెల్లూరులోనే ఎంపీ స్థానాల నామినేషన్లు

నెల్లూరుతో పాటు తిరుపతి లోక్‌సభ నామినేషన్‌లను కూడా నెల్లూరులోనే స్వీకరించనున్నారు. నెల్లూరు లోక్‌సభకు రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఏఆర్‌ఓగా డిఆర్‌ఓ ఎస్.వి.నాగేశ్వరరావు వ్యవహరిస్తారు. ఈ స్థానానికి నామినేషన్లు కలెక్టరేట్‌లోనే స్వీకరిస్తారు. అలాగే తిరుపతి లోక్‌సభ స్థానానికి జేసీ రేఖారాణి రిటర్నింగ్ అధికారిగా, అటవీశాఖ సెటిల్‌మెంట్ అధికారి వి.కనకనర్సారెడ్డి ఏఆర్‌ఓగా వ్యవహరిస్తారు. ఈ స్థానానికి నామినేషన్లను జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరిస్తారు. ఇక అసెంబ్లీల వారీగా చూస్తే కావలికి ఆర్డీవో వెంకటరమణారెడ్డి, ఆత్మకూరుకు ఆర్డీఓ డి.కోదండరామిరెడ్డి, కోవూరుకు జడ్పీ సిఇఓ ఎం.జితేంద్ర, నెల్లూరు నగరానికి తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్ ఎల్.విజయచందర్, నెల్లూరురూరల్‌కు ఆర్డీఓ సి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, సర్వేపల్లికి పౌరసరఫరాల విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ జి.మల్లికార్జున, గూడూరుకు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, సూళ్లూరుపేటకు నాయుడుపేట ఆర్డీఓ ఎం.వి.రమణ, వెంకటగిరికి డిఆర్‌డిఏ పిడి వి.ఆర్.చంద్రమౌళి, ఉదయగిరికి డ్వామా పిడి గౌతమిలు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.

# పరిశోధనలతోనే ఫలితాలు



మాట్లాడుతున్న డా॥ ఏ.వి.రమణారెడ్డి

విద్యార్థులు విభిన్న రంగాల్లో పరిశోధనలు చేయడం ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించగలరని ముంబైలోని బాబా అటానమిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.వి.రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో 'రేడియో కెమిస్ట్రీ అండ్ రేడియో ఐసోటోప్ అప్లికేషన్స్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రేడియో ఐసోటోప్స్ వల్ల నూతన పరిశోధనలు చేసేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధి చికిత్సలోనూ రేడియేషన్ పాత్ర కీలకంగా ఉందన్నారు. రేడియో థెరపీ ఉపయోగాలను ఆయన విద్యార్థులకు విశదీకరించారు.

విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బార్క్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశన్, డాక్టర్ టి.జి.శ్రీనివాసన్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యురగయ్య, సదస్సు కన్వీనర్ డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ సునందమ్మ, డాక్టర్ విజయ, డాక్టర్ వేణుగోపాలరెడ్డి, డాక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరురూరల్ వదిలేది లేదు



తెలుగుదేశంపార్టీతో పొత్తులో భాగంగా బీజేపీకి నెల్లూరు గ్రామీణ నియోజకవర్గాన్ని కేటాయించారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సీటును వదులుకోబోమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ నుండి బీజేపీ అభ్యర్థిని నిలబెట్టాలనుకున్నామని అయితే తిరుపతి లోక్‌సభను, నెల్లూరురూరల్ అసెంబ్లీని కేటాయించారన్నారు. పొత్తుల సందర్భంగా చిన్నచిన్న అవాంతరాలు వస్తాయని, ఇవన్నీ సర్దుకుని ఇరుపార్టీల వాళ్లం విజయానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో తెలుగుదేశం, బీజేపీ కార్యకర్తలు కలిసి పనిచేసి గెలుపుబాటలో పయనిస్తామన్నారు. నెల్లూరురూరల్, తిరుపతి పార్లమెంటు స్థానాలను ఇక మార్చే అవకాశం లేదన్నారు. దేశ వ్యాప్తంగా ఎన్డీఏకు 300కుపైగా స్థానాలు ఖాయమని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ నెల్లూరురూరల్ స్థానానికి సురేష్‌రెడ్డి పేరు ఒక్కటే ప్రతిపాదించామని, ఇక ఆ స్థానాన్ని మార్చలేరన్నారు. ఈ సమావేశంలో ఇంకా ఆ పార్టీ నాయకులు మిడతల రమేష్, మండ్ల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో అక్కినేని అఖిల్ జన్మదిన వేడుక

ప్రముఖ సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు మనవడు అఖిల్ జన్మదినం సందర్భంగా ఈనెల 8న అక్కినేని నాగార్జున యువసేన నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టింది. కార్యక్రమంలో యువసేన జిల్లా అధ్యక్షుడు ఎన్.మధు, నాగార్జున్‌రెడ్డి, సాయికుమార్, అరుణ్, శ్రీను, రమేష్ తదితరులు దుస్తులు, పండ్లు పంపిణీచేసారు.

# యువత రక్తదానం

యువ సినీ హీరో అల్లు అర్జున్ జన్మదినం సందర్భంగా చిరంజీవి యువత ఆధ్వర్యంలో నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ దగ్గరగల రెడ్‌క్రాస్ రక్తనిధి ప్రాంగణంలో 189మంది యువకులు ఈనెల 8న రక్తదానం చేసారు. కాంగ్రెస్ యువనాయకుడు ఆనం రంగమయూర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న జిమ్ శివ తదితరులను అభినందించారు. ఈ శిబిరంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు వెంకటరమణ, సభ్యులు బద్రి, ప్రశాంతి, సనత్ తదితరులు పాల్గొనగా రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ పర్యవేక్షణలో వైద్యాధికారులు పెంచలసుబ్బయ్య నిర్వహించారు.

# పోలింగ్ ప్రశాంతంగా జరపండి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్

సాధారణ ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు పటిష్టమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ పేర్కొన్నారు.

బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సాధారణ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆయా జిల్లాల వారీగా ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా ఓటర్ల జాబితా సక్రమంగా వుండేలా చూసుకోవాలన్నారు. డూప్లికేటింగ్ ఓటర్లు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అనుబంధ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయుటలో నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవా లన్నారు. ఓటరు స్లిప్‌లు ఓటరు జాబితా ప్రకారం అందరికీ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకొని ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియలో ఎసీ, ఎస్టీ కాలనీలలో మరియు పట్టణ ప్రాంతాలలో ఓటరు స్లిప్‌లు పంపిణీ కార్యక్రమం పూర్తిస్థాయిలో నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలలో పోటీచేయు అభ్యర్థులు తమ ప్రచారం నిమిత్తం ఖర్చుకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయుటలో నియమించిన ఎన్నికల కమిటీలు సమర్ధవంతంగా ఎలాంటి సమస్యలు లేకుండా పటిష్టంగా తనిఖీలు నిర్వహించి సంబంధిత నివేదికలు ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి పంపాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన కనీస సౌకర్యాలను ఏర్పాటుచేయాలన్నారు.

ఈ సమావేసంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, యస్పీ నవదీప్‌సింగ్, జాయింట్ కలెక్టర్ రేఖారాణి, అదనపు జె.సి ఆర్.ఎస్.రాజ్‌కుమార్, డి.ఆర్.ఓ యస్.వి. నాగేశ్వరరావు, డి.ఆర్.డి.ఏ పి.డి చంద్రమౌళి, ఆర్.డి.ఓలు సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు. రమణ, వెంకటరమణారెడ్డి, కోదండరామిరెడ్డి, డ్వామా పిడి గౌతమి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం పట్టారు

అక్రమంగా తరలిస్తున్న 50లక్షల విలువచేసే 125ఎర్రచందనం దుంగలను బుధవారం తెల్లవారుజామున కావలి పోలీసులు పట్టుకున్నారు. బుధవారం కావలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ బాలకోటేశ్వరరావు దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. సి.ఐ ప్రసాద్, ఎస్ఐ అంజిబాబు, పోలీసుసిబ్బంది తెల్లవారుజామున వాహనాల తనిఖీ చేపట్టాము. ట్రంకురోడ్డులోని భాష్యం స్కూల్ వద్ద ఓ టిప్పర్‌ను తనిఖీ చేయగా అందులో 125 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వీటితో పాటు లారీని కూడా స్వాధీనం చేసుకున్నాము. లారీలో వున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, ఎర్రచందనాన్ని అటవీ శాఖాధికారులకు అప్పగించామని డిఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో సి.ఐ ప్రసాద్, ఎస్ఐ అంజిబాబు కూడా పాల్గొన్నారు.

# మాలలు చైతన్యులవ్వాలి

## కారెం శివాజీ

మాలలు రాజకీయ చైతన్యవంతులై ముందుకు నడవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు కారెం శివాజీ పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలలో మాలమహానాడు అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు. ఈ ప్రభుత్వాలు మాలలకు తీరని అన్యాయం చేస్తున్నాయని, ఎస్టీ, ఎస్సీ ఉపప్రణాళిక అమలులో సైతం పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని విమర్శించారు. నెల్లూరుజిల్లాలో కావలి, గూడూరు, సర్వేపల్లి, సూళ్లూరుపేట, ఉదయగిరి, వెంకటగిరి, కోవూరులలో తమ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. తమకు ఆర్థికబలం లేకున్నా సుశిక్షితులైన కార్యకర్తల బలం ఉందన్నారు. మాల ఉద్యోగులు కూడా అభ్యర్థులకు సహాయసహకారాలు అందించాలని కోరారు.

ఈ సమావేశంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కొప్పోలు చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు పోతురాజుజాన్ విజయం, నగర అధ్యక్షుడు ప్రసాద్, ఇంకా మురళి, మస్తానయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

# గాలి వాన భీభత్సం

మండు వేసవిలో గాలి, వాన భీభత్సం చేసింది. పిడుగులు పడి ఇరువురు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం నెల్లూరుజిల్లా వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం, ఉదయగిరి, చేజర్ల, కలువాయి మండలాలలో ఈ భీభత్సం చోటుచేసుకుంది. పెనుగాలులతో కూడిన భారీ వర్షాలకు ఈ మండలాలలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కాలు, చెయ్యి కూడదీసుకుని కోత దాకా పంటలను తీసుకొచ్చిన రైతులకు తీరని నష్టం మిగిలింది. వింజమూరు మండలంలో తమలపాకు, అరటి, మొక్కజొన్న, మిరప, పత్తిపంటలు బాగా దెబ్బతిన్నాయి. అరటి తోటలు నేలకొరిగాయి. ఈ మండలాలలో మామిడి పూత పూర్తిగా రాలిపోయింది. దక్కిలి, రాపూరు, కలువాయి మండలాలలో వందల ఎకరాలలో నిమ్మతోటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల చెట్లుకూలాయి. పూరిగుడిసెల పైకప్పులు లేచిపోయాయి. పిడుగులు పడి కలువాయి మండలం త్రోపుగుంటలో అనిల్ అనే బాలుడు, చేజర్ల మండలం బిల్లుపాడులో చందు అనే బాలుడు మృతిచెందారు.

# అత్యధికస్థానాలు వైయస్సార్సీపీకే

## మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ప్రచారర్యాలీలో పాల్గొన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

చిట్టమూరు మండలం మన్నెమాల గ్రామంలో ఈ నెల 8న వైయస్సార్సీపీ ఎన్నికల ప్రచారసభ విజయవంతమైంది. వైయస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నేదురుమల్లి పద్మనాభరెడ్డి నేతృత్వంలో మండల కన్వీనర్ వంకా రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగసభలో వైయస్సార్సీపీ సీజీసీ సభ్యుడు, నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాజన్నరాజ్యంలోని సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావాలంటే జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనావుందని, వైయస్సార్ లేని లోటు తీర్చడం ఒక్క జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. సీమాంధ్రలో 130అసెంబ్లీ, 25పార్లమెంట్ స్థానాలు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుచుకుంటుందని పేర్కొంటూ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ముఖ్యమంత్రి కావడమే కాక కేంద్రంలో చక్రం తిప్పడం ఖచ్చితమన్నారు. అలాగే నెల్లూరుజిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు వైయస్సార్సీపీ అభ్యర్థులు కైవసం చేసుకోవడం తప్పక జరుగుతుందన్నారు. వైయస్సార్సీపీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ఒకప్పుడు బీజేపీని మతతత్వ పార్టీ అని ఎద్దేవాచేసిన చంద్రబాబు ఇప్పుడు ఆ పార్టీతోనే జతకట్టడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రజలను మాటలతో బురిడీ కొట్టించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు దువ్వూరు బాలచంద్రారెడ్డి, లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ అభ్యర్థిని దువ్వూరు భారతి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## పందేలే పందేలు

ఓవైపు ఎన్నికలు... మరోవైపు టీ-20 క్రికెట్ మ్యాచ్‌లు... పందేల రాయుళ్లకయితే పెద్దపండుగే అనుకోవచ్చు. మొన్ననే టీ-20 ప్రపంచ క్రికెట్ కప్ పోటీలు ముగిసాయి. నెల్లూరు కేంద్రంగా భారీఎత్తున పందేలు జరిగాయి. పోలీసులైతే కొందరు బుకీలను అరెస్ట్ చేయడం జరిగింది. ఇండియా ఫైనల్ దాకా రావడంతో ఈసారి పందేలు జోరుగాసాగాయి.

క్రికెట్ మ్యాచ్ అంటే ఆరోజుకారోజు అయిపోతుంది. దివాళా తీసే వాళ్లు తీస్తారు. పందేం గెలిచిన వాళ్లు ఆరోజే పండుగ చేసుకుంటారు. క్రికెట్ పందెలు ఆరోజే అటో ఇటో తేలిపోతుంది. కాని ఎన్నికల పందేలే ఎటూ తేలక కోట్లలో పందేలు పెట్టినవాళ్లు తలలు పట్టుకుంటున్నారు. నెల్లూరు నగరపాలకసంస్థలో గెలుపోటముల మీద నెల్లూరులో కోట్ల రూపాయలు పందేలు కాసి వున్నారు. పందేలు పెట్టిన వారిలో కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ఉద్యోగులు కూడా ఉన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో వైకాపాకు 30కిపైగా డివిజన్లు వస్తాయని కొందరు, రావని కొందరు, నెల్లూరు మేయర్ సీటు తెలుగుదేశందని, కాదు వైకాపాదని... ఇలా పందేలు కాసి వున్నారు. గట్టిపోటీ వున్న కొన్ని డివిజన్ల మీద కూడా పందేలు భారీగా కాసివున్నారు.

ఈ నెల 9వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగి వుంటే ఎన్నికల విజేతలతో పాటు పందేల విజేతలెవరో తేలిపోయి వుండేది. కాని సుప్రీంకోర్టు మే 7 తర్వాతే కౌంటింగ్ జరపాలని చెప్పడంతో అభ్యర్థులతో పాటు పందేల రాయుళ్లు కూడా అప్పటి దాకా టెన్షన్‌తో ఎదురుచూడక తప్పదు.

## వేళలు మారిన విద్యుత్ కోత

పదో తరగతి పరీక్షల వేళల్లో మార్పు జరిగినందున ఈనెల 7నుంచి విద్యుత్ కోతల సమయంలో మార్పులు చేసినట్లు తెలిసింది. నెల్లూరులో ఉదయం 9గంటల నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు, మున్సిపాలిటీలైన కావలి, గూడూరు, ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేటలలో ఉదయం 8 నుంచి 10గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి 5.30గంటల వరకు అన్ని మండల కేంద్రాల్లో ఉదయం 7.30నుంచి 10.30గంటల వరకు మధ్యాహ్నం 3 నుంచి 6గంటల వరకు విద్యుత్‌కోత వుంటుందని ఏపి ట్రాన్స్‌కో నిర్ణయించినట్లు టెక్నికల్ డీఈఈ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

## పోస్టుకార్డుపై రికార్డు

వందేమాతరం పూర్తి గీతాన్ని 154సార్లు ఒక పోస్టుకార్డుపై ఒకవైపే వ్రాసి నెల్లూరుకు చెందిన ఎం.గీతాలక్ష్మి రికార్డు సృష్టించారు. గతంలో పోస్టుకార్డుపై 140సార్లు వందేమాతరం గీతం వ్రాసిన అలూరు రామ ఆచారి స్ఫూర్తితో ఈ ప్రయత్నం చేసినట్లు ఆమె వెల్లడించారు. వందేమాతరం గీతాన్ని 154సార్లు వ్రాసిన ఈ పోస్టుకార్డును గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపుతున్నారు.

### మైథిలి మనోహర్‌రెడ్డికి...

## లయన్స్ సేవా అవార్డు




అవార్డునందుకుంటున్న బి.మనోహర్‌రెడ్డి

గుంటూరులో ఈనెల 6న జరిగిన లయన్స్ అంతర్జాతీయ సంస్థ సమావేశంలో నెల్లూరీయుడైన లయన్ మైథిలి మనోహర్‌రెడ్డికి లయన్స్ గవర్నర్ శరత్‌బాబు, వైస్ గవర్నర్స్ వై.అమృతవల్లి, కె.చిన్నపరెడ్డిలు సేవా అవార్డును బహుకరించారు. కౌమారదశ పిల్లల దిశానిర్దేశానికి సంబంధించిన అనేక కార్యక్రమాలను లయన్స్ క్వెస్ట్ ప్రోగ్రామ్ ద్వారా ఆయన నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డు ఆయనకు లభించింది.

కార్యక్రమంలో 6 జిల్లాల లయన్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ సంపద చిన్నారులు, యువతేనని, వారిని సక్రమమార్గంలో నడువలసిన ఆవశ్యకత ఎంతో వుందని తత్సంబంధిత కార్యక్రమాలకు తనకు ఈ గుర్తింపు లభించడం ఆనందంగా వుందన్నారు.

## పోస్టల్‌లో భద్రాద్రి తలంబ్రాలు

భద్రాచలంలో శ్రీ సీతారామస్వామి దేవస్థానం వారు స్వామి వారి కల్యాణ తలంబ్రాలు, ప్రసాదాలను పోస్టల్‌శాఖ ద్వారా ఇళ్ల వద్దకే పంపే ఏర్పాట్లు చేసారని పోస్టాఫీసు సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. తలంబ్రాలు, ప్రసాదం కావాలనుకున్న భక్తులు తమకు దగ్గర్లో వున్న పోస్టాఫీసులో కార్యనిర్వహణాధికారి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, భద్రాచలం పేరుతో మనీ యార్డర్ పంపిస్తే, ఈ మనియార్డర్ చేరిన వారంరోజులలోపు భక్తులకు రిజిష్టర్ పోస్టు ద్వారా తలంబ్రాలు, ప్రసాదాలు అందుతాయని, ఈ సౌకర్యం ఈ నెల 31వ తేదీ దాకానే వుంటుందని ఆయన తెలిపారు.

## సంధ్యారాణికి వీడ్కోలు

నెల్లూరు ఐదో అదనపు మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ తిరుపతికి బదిలీ అయిన సంధ్యారాణికి సోమవారం నెల్లూరులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్. కనకదుర్గారావు మాట్లాడుతూ సంధ్యారాణి తన బాధ్యతలను ఎంతో క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా నిర్వర్తించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు ఎ.జగదీష్ చంద్రరావు, నరసింహరాజు, శ్రీరామచంద్రమూర్తి, ఆనంద్, సీనియర్ సివిల్‌జడ్జిలు ఎస్.రజని, ఎం.రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బాల సుబ్రహ్మణ్యం, ఇంకా పలువురు న్యాయవాదులు పాల్గొని సంధ్యారాణిని సత్కరించారు.

## వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుండి మొదలయ్యాయి. 20వ తేదీ వరకు జరుగనున్నాయి. 10వ తేదీ రాత్రి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. 11వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహనం, 12వ తేదీ ఉదయం సూర్యప్రభ, రాత్రికి హంసవాహనోత్సవం, 13వ తేదీ ఉదయం యాళి, రాత్రి చంద్రప్రభ, 14వ తేదీ చప్పరం, వెండి హనుమంతసేవ, 15వ తేదీ మోహిని అవతారం, గరుడసేవ, 16వ తేదీ స్వామి వారి కల్యాణం, గజవాహనోత్సవం జరుగుతాయి. 17వ తేదీ ఉదయం స్వామివారి రథోత్సవం, రాత్రి పుష్పక విమాన అలంకారోత్సవం నిర్వహిస్తారు. 18వ తేదీ వెన్నతాళి ఉత్సవం, అశ్వ వాహనం, 19వ తేదీ ముసుగుల సేవ, పొన్న వాహనోత్సవం, 20వ తేదీ చక్రస్నానం, రాత్రి ఏకాంతసేవ నిర్వహిస్తారు. ధ్వజా వరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## రత్నం కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభిస్తున్న సివిల్ జడ్జి హేమలత

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని అనిల్ గార్డెన్స్‌లో ఈనెల 6న దర్గామిట్ట సరస్వతి నగర్‌లోని డా॥కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ చిన్నారుల "గ్రాడ్యుయేషన్ డే" కార్యక్రమం ఘనంగా జరిగింది. కిండర్ గార్డెన్ విద్యను పూర్తి చేసుకొని ప్రాథమిక విద్య చదువుటకు సంసిద్ధులవుతున్న యుకెజి విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్లేక్లాసు, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులు స్టేజీపైన ముద్దు ముద్దు పలుకులతో చేసిన యాంకరింగ్, నృత్యాభినయాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డా॥కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూలు డైరెక్టర్లు డా॥కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సివిల్‌జడ్జి యస్.హేమలత చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేటులు, మెడల్స్ అందించారు.

### "ఇన్ఫోసిస్"కు ఎంపికైన....

## నారాయణ విద్యార్థులు



నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభతో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు క్యాంపస్ సెలక్షన్‌లో 26 మంది ఎంపికయ్యారని నారాయణ విద్యాసంస్థల జిఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6న కళాశాలలో విద్యార్థులను అభినందించిన ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు మంచి మేధస్సుతో మరోసారి సత్తా చాటారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వారికి ఒక్కొక్కరికి వార్షిక వేతనం రూ॥ 3.20లక్షలు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.భార్గవ రామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

***నారాయణ చిన్నారుల కాన్వొకేషన్:***

నెల్లూరు వేదాయపాలెంలోని నారాయణ ఈటెక్నో స్కూల్లో ఈనెల 6న యుకెజి విద్యార్థులకు కాన్వొకేషన్ జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక అంశాలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఏజిఎం రమణారెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రసన్న, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి శశికళ, ఏఓ ప్రభాకర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 8వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో సీతారామాంజనేయ లక్ష్మణ స్వాములకు అభిషేకం నిర్వహిస్తున్న ఇస్కాన్ ప్రతినిధి డా॥ సుఖదేవస్వామి

## ప్రభువా! కోటంరెడ్డిని గెలిపించు



ప్రార్థనలలో పాల్గొన్న మందా బాబ్జీ, వైకాపా కార్యకర్తలు

వైఎస్సార్సీపీ నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని జిల్లా వైఎస్సార్సీపీ స్టీరింగ్ కమిటీ సభ్యులు మందా బాబ్జీ ఆధ్వర్యంలో ఈనెల 4న నెల్లూరు మూలాపేట బట్వాడిపాలెం సెంటర్‌లోని ది తెలుగు సెకండ్ బాపిస్ట్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ జాన్‌విల్సన్, జంగాల గోపాలరావు మందా పెద్దబాబు, హరి కుమార్, అగ్గిరప్ప, వేముపాటి జాన్, దిలీప్‌కుమార్, పల్లాల రమణయ్య, సులోచన, కొమ్మి రమణమ్మ, జయశ్రీ, యం.సునీత తదితరులు పాల్గొన్నారు.

# నారాయణలో పదికే భోజనం

నెల్లూరురూరల్ మండలం చింతారెడ్డిపాలెంలోని నారాయణ ఆసుపత్రిలో ఇటీవలే ఆరోగ్యమస్తు ఉచిత వైద్యసేవలను ప్రారంభించడం తెలిసిందే! ఆరోగ్యమస్తు క్రింద ఇన్‌పేషంట్లుగా చేరేవారికి ఉచితంగా ఆసుపత్రి వారే భోజనం అందిస్తున్నారు. కాగా సోమవారం నుండి అవుట్ పేషంట్లకు కూడా పది రూపాయలకే భోజనం అందజేసే కార్యక్రమాన్ని డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ వీరప్రసాద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ ఆసుపత్రి ఏజిఎం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణ ఆసుపత్రికి ప్రతిరోజూ నెల్లూరు జిల్లా నుండే కాక చిత్తూరు, ప్రకాశం, కడప, ఇతర జిల్లాల నుండి పెద్దసంఖ్యలో రోగులు వస్తుంటారని తక్కువ ధరకు వారికి నాణ్యమైన ఆహారం అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. 10రూపాయలకే సాంబారు అన్నం లేదా పెరుగన్నం అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం పేదరోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. ఆరోగ్యమస్తు క్రింద ఇంతవరకు 54వేల మందికి ఉచితంగా వైద్యసేవలు అందించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిఇఓ విజయమోహన్ రెడ్డి, అదనపు సూపరింటెండెంట్ రామ్మోహన్, వైద్యసంస్థల కో-ఆర్డినేటర్ విజయకుమార్, ప్రిన్సిపాల్ వీరనాగిరెడ్డి, ఏట్ ఎస్.వి.సుబ్బారావు, మెడికల్ సూపరింటెండెంట్ సతీష్‌కుమార్‌లు పాల్గొన్నారు.



పది రూపాయల భోజనం పథకాన్ని ప్రారంభిస్తున్న ఆసుపత్రి డైరెక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు

సింహపురి సమాచారం

# మోడీని, 'దేశం'కేడీని నమ్మొద్దు

- మంత్రి జేడీ శీలం

బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ, తెలుగుదేశం కేడీ చంద్రబాబును నమ్మొద్దని కేంద్ర మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ దళిత చైతన్య బస్సుయాత్ర ఈ నెల 8వ తేదీన నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీని మతోన్మాదిగా విమర్శించిన చంద్రబాబు మళ్ళీ అతనితోనే చేతులు కలపడం విస్మయం కలిగిస్తుందన్నారు. మోడీ నరరూపరాక్షసుడని, ప్రజల హక్కులు కాలరాసే నియంతని, కార్పొరేట్ కంపెనీలకు కార్పెట్లు పరిచే నాయకుడని విమర్శించారు. ముస్లింలు, క్రిస్టియన్‌లు టీడీపీ, బీజేపీలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ పార్టీలకు ఓట్లేస్తే భవిష్యత్ అంధకారమేనన్నారు. రాష్ట్ర విభజనలో అన్ని పార్టీలు ముద్దాయిలేనని, కాని ఒక్క కాంగ్రెస్‌పైనే నిందవేస్తున్నారని అన్నారు. వైయస్ హయాంలో కూడా దళితులను మరచి ఇతర ప్రాంతాలలోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. సమాజంలో దళితులకు సముచిత స్థానం దక్కింది ఒక్క కాంగ్రెస్‌పార్టీలో మాత్రమేనన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పి.చెంచలబాబుయాదవ్, పి.అరుణమ్మ, రఘురామ్‌ముదిరాజ్, టి.బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి జె.డి.శీలం

# తాత్కాలిక తాయిలాలకు లొంగొద్దు

- కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరులో ఈనెల7న వైయస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీ ఛైర్మెన్‌గా తాను చేసిన అభివృద్ధిని చూసి వైయస్సార్సీపీ అభ్యర్థులకు ఓటేయమని, తాత్కాలిక తాయిలాలకు లొంగొద్దని ఓటర్లకు సూచించారు. తాను పొదలకూరులో ఒకటిన్నర కోట్ల రూపాయలతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేసానని, మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నానన్నారు. తన హయాంలో అభివృద్ధి జరగలేదని ఏ రాజకీయ నాయకుడైనా నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని పేర్కొన్నారు. నిజాయితీతో ప్రజలకు సేవచేసే అభ్యర్థులనే వైయస్సార్సీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులుగా పోటీలో నిలిపిందన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో పొదలకూరు వినాయక మాన్యంలో పలువురు టీడీపీ కార్యకర్తలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైయస్సార్సీపీలో చేరారు. అలాగే ముత్తుకూరు దగ్గర పోర్టు పునరావాసకాలనీ మధురానగర్‌లోని మత్స్యకార మహిళలు, బీసీ కాలనీ మైనార్టీ మహిళలు కాకాణి సమక్షంలో వైయస్సార్సీపీలో చేరారు. కార్యక్రమంలో నేతలు పెడమల్లు రమణారెడ్డి, తెనాలి నిర్మలమ్మ, మద్దిరెడ్డి రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, పొదలకూరు ఎంపీటీసీ అభ్యర్థులు కలిచేటి రామిరెడ్డి, నోట శ్రీలత, కోనం చినబ్రహ్మయ్య, కండే సులోచన, కొంగి హైమావతి, జడ్పీటీసీ అభ్యర్థి బిరుదవోలు మహేంద్ర, మరుపూరులో వళ్ళూరు గోపాల్‌రెడ్డి, వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, పెంచలరెడ్డి, సుబ్బారెడ్డి, వేణుంబాక సుమంత్‌రెడ్డి, ముత్తుకూరులో జడ్పీటీసీ అభ్యర్థి నెల్లూరు శివప్రసాద్, ఎంపీటీసీ అభ్యర్థి మురాల వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో ముందుకు సాగిపోతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

# రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యం

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దొంతాలి గ్రామంలో రూరల్ మండల జడ్.పి.టి.సి అభ్యర్థి గోళ్ళ సుబ్బరత్నమ్మ, దొంతాలి ఎం.పి.టి.సి అభ్యర్థి తాళ్ళూరి లక్ష్మమ్మతో కలిసి ఈనెల 5న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ కో-ఆర్డినేటర్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్యకర్తల సమావేశంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపద వస్తే, కష్టం వస్తే ఒక్క ఫోన్ కాల్ చేస్తే మన మధ్యకు వచ్చే దివంగత మహానేత వై.యస్.ప్రవేశపెట్టిన 108, 104 వాహనాలు డీజిల్ డబ్బులు లేక మూలనపడి ఉన్నాయని, అనేక వాహనాలకు రిపేర్లు వచ్చి ఆగిపోయాయని, వాటిమీద దృష్టిపెట్టి ప్రజలకు ఉపయోగపడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని విస్మరించి ప్రచార ఆర్భాటాలకు వందల కోట్లతో ప్రచార రథాలు తిప్పటం దుర్మార్గమన్నారు. ఆరోగ్యశ్రీలో 133జబ్బులు తొలగించారని, వడ్డీలేని రుణాలు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే చెక్కులు బ్యాంకులలో పాస్‌కావటం లేదని, అమ్మహస్తం కింద అందించే సరుకులు నాసిరకంగా ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాలను నీరుగార్చి ఆరుసార్లు కరెంటు ఛార్జీలు, నాలుగుసార్లు ఆర్టీసీ ఛార్జీలు, మూడుసార్లు ఇంటి పన్నులు పెంచి 44వేల కోట్ల పన్నుల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. కాంగ్రెస్ పార్టీచేసే కుటిల యత్నాలను ప్రజలు తిప్పి కొట్టాలని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు.

పై కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, మలినేని వెంకయ్య, మలినేని రాజయ్య, భాస్కర్‌నాయుడు, బాసంకృష్ణ, సూరిశెట్టి అనీల్, నాగరాజు, రంగ తదితరులు పాల్గొన్నారు.


దొంతాలి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

# కమనీయం... సీతారామ కల్యాణం

జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ - శ్రీమతి సౌజన్య, జిల్లా జడ్జి సి.హెచ్.కనకదుర్గారావు - శ్రీమతి కనకదుర్గ దంపతులు పెళ్ళిపెద్దలుగా వ్యవహరించగా మంగళవారం నెల్లూరులోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా గల శ్రీరామకోటి స్థూప ప్రాంగణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలలో భాగంగా శ్రీ శబరి రామక్షేత్రం ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం జరిగింది. సీతారాముల కల్యాణం, అక్షతారోహణం, ముత్యాల తలంబ్రాలు తదితర వేడుకలు కనుల పండువగా జరిగాయి. భక్తులకు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో అన్నదానం నిర్వహించారు.

నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు కూడా హాజరై ఈ కల్యాణోత్సవాన్ని తిలకించారు.


కల్యాణంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జి దంపతులు

# సమైక్యవాదులారా... ఏకం కండి

- ఆనం జయకుమార్‌రెడ్డి

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన సమైక్య ఉద్యమకారులంతా ఒకేతాటి మీదకు రావాలని జైసమైక్యాంధ్ర పార్టీ జిల్లా నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 7వతేదీన ఆనం జయకుమార్‌రెడ్డి నేతృత్వంలో సుజాతమ్మకాలనీలోని ఆయన ఇంటి వద్ద నుండి సమైక్యవాదుల బైక్‌ర్యాలీ జరిగింది. సమైక్యవాదులు భారీసంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ కొండాయపాలెంగేటు, కెవిఆర్ పెట్రోల్‌బంకు, ఆర్టీసీ, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండు, స్టోన్‌హౌస్‌పేట, సంతపేట, మూలాపేటల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆనం జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి అని, చివరివరకు సమైక్యాంధ్ర కోసం పోరాడింది ఆయనేనన్నారు. ఆయన పెట్టిన పార్టీకి సమైక్యవాదులంతా అండగా నిలవాలన్నారు. కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, వైసిపి... ఈ నాలుగు పార్టీలు కూడా రాష్ట్ర విభజనకు సహకరించి తెలుగుజాతికి తీరని ద్రోహం చేసాయన్నారు.

ఈ కార్యక్రమంలో జైసమైక్యాంధ్రపార్టీ నాయకులు ఏసునాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, బాబునాయుడు, గార్లపాటి జయకుమార్, సి.హెచ్.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఈ నెల 5వ తేదీ బాబూ జగ్జీవన్‌రామ్ 107వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరు వేదాయపాలెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్

# అప్పుడు వీరుడు... ఇప్పుడు భీరువు

శ్రీను గల్పిక

భేతాళకథ

పట్టువదలని హైటెక్ విక్రమార్కుడు ఎర్లీమార్నింగ్ ఎయిట్ థర్టీకల్లా నిద్రలేచాడు. రాత్రి ఖాళీకడుపుతో పడుకోవడంతో కడుపులో ఎలుకలు, పిల్లులు రన్నింగ్ రేస్ పెట్టుకున్నట్లుగా ఆకలి కాసాగింది. వెంటనే మురళీకృష్ణ హోటల్ కెళ్లి నాలుగు మసాలదోశలు, నాలుగు ప్లేట్లు పూరి లాగించేసి తిరిగి రూమ్‌కొచ్చి కాలకృత్యాలు తీర్చుకున్నాడు. తర్వాత మద్రాసు బస్టాండు వద్దకొచ్చి షార్ నుండి వదిలిన రాకెట్‌లా దూసుకొచ్చిన ఆటో ఎక్కాడు. విక్రమార్కుడు సీట్లో కుదురుగా కూర్చునేలోపే పెద్దాసుపత్రి ముందు ఆటో ఆగింది. విక్రమార్కుడు అక్కడ దిగేసి పెద్దాసుపత్రి మార్చురీ దగ్గరకు వెళ్లాడు. ఎన్నికల మద్యాన్ని వీకలదాకా తాగి ఆత్మహత్య చేసుకున్న ఓ మందుబాబు బాడీని తన భుజం మీద వేసుకుని ఎర్రటి ఎండలో బోడిగాడితోటలోని రోటరీక్లబ్ స్మశాన వాటిక వైపుకు నడవసాగాడు. అలా చెమటలు కార్చుకుంటూ ఆర్టీసీ బస్టాండ్ దాకా వచ్చినా బాడీ లోని భేతాళుడు కదలక పోవడంతో విక్రమార్కుడికి అనుమానమొచ్చి బాడీని గట్టిగా తడుతూ భేతాళ... భేతాళ అని అరిచాడు. అప్పుడు భేతాళుడు... ఏంటి విక్రమార్క, ఇంత పొద్దున్నే నిద్రలేపుతున్నావని నీరసంగా అన్నాడు. పొద్దునా, పాడా మిట్టమధ్యాహ్న మైంది... కళ్లు తెరచి చూడు అని విక్రమార్కుడు అన్నాడు. అప్పుడు భేతాళుడు... కల్తీమద్యం తాగిన బాడీలో దూరినట్లున్నాను విక్రమార్క... అందుకే ఇంకా మత్తువదల్లేదు. నా సంగతి సరేగాని, నువ్వేంటి వై.యస్.రాజశేఖరరెడ్డి లాగా మండుటెండలో పాదయాత్ర చేస్తున్నావు, నిన్ను చూస్తుంటే సొంత బలాన్ని కాకుండా పరాయిశక్తిని నమ్ముకున్న చంద్రబాబు గుర్తుకొస్తున్నాడు. నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకు దానికి సంబంధించిన సన్నివేశాలు చూపిస్తాను... అలా బార్‌లో కూర్చుందాం పద అంటూ ఆర్టీసీ దగ్గరున్న ఓ బార్‌లోకి తీసుకె ళ్లాడు. భేతాళుడు ల్యాప్‌టాప్ తీసి చంద్రబాబుకు సంబంధించిన ఓ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసాడు. స్క్రీన్ మీద సీన్‌లు మొదలయ్యాయి.

2004కు ముందు చంద్రబాబు... అనే టైటిల్‌తో సీన్‌లు రాసాగాయి. క్లింటన్ గారు, మీరు ఇండియా పర్యటనకు వస్తే మా హైదరాబాద్‌కు రావడం మిస్ కావద్దు... మా అద్భుతమైన ఐటి ప్రగతిని చూడడం అసలే మిస్‌కావద్దు... అని చంద్రబాబు క్లింటన్‌కు మెయిల్ పెట్టాడు. వెంటనే క్లింటన్ నుండి రిప్లై... నేను హైదరాబాద్‌నే కాదు, మిమ్మల్ని, మీ అద్భుతమైన పాలనను చూడడానికి కూడా హైదరాబాద్ వస్తాను, ఇట్లు... మీ అభిమాని బిల్ క్లింటన్.

చంద్రబాబు ఢిల్లీలోని బీజేపీ కార్యాలయానికి వెళ్లాడు. ఆయన్ను చూడగానే ప్రధానిగా వున్న వాజ్‌పేయి, ఉపప్రధాని అద్వానీ లేచి నిలుచున్నారు. చంద్రబాబుకు గౌరవప్రదంగా సీటు చూపించి కూర్చో మన్నారు. అక్కడే వున్న నరేంద్ర మోడీ అయితే... బాబు గారు, కాఫీ, టీ, మిల్క్, బూస్ట్, బోర్నవీటా... వీటిలో ఏం తీసుకుంటారని అడిగాడు. దానికి చంద్రబాబు, నాకు కాఫీ, టీలు, బ్రాందీ, విస్కీ, బీరు అలవాట్లు లేవు. గుట్కా, మాణిక్‌చంద్‌లు తినను, కనీసం పేకాట కూడా ఆడను. వక్కపొడి అలవాటు కూడా లేదు. ఒక గ్లాసు మజ్జిగ చాలన్నాడు. గ్లాసు మజ్జిగ అడిగే దానికి ఇన్ని చెప్పాలా అనుకుంటూ నరేంద్ర మోడీ కిచెన్‌లోకి వెళ్లాడు. చంద్రబాబు వుండి... 2004ఎన్నికల్లో మన పార్టీల పొత్తు విషయం గురించి మాట్లాడ్డానికి వచ్చానన్నాడు. అప్పుడు వాజ్‌పేయి, అద్వానీలు చంద్రబాబు చేతులు రెండూ గట్టిగా పట్టుకుని... బాబూ ఇవి చేతులు కాదు కాళ్లు అనుకో... మాతో పొత్తు వుండదని చెప్పొద్దు.. మీ పార్టీతో పొత్తులేకుంటే ఆంధ్రాలో మాకు రెండు సీట్లు కూడా రావు... దయచేసి పొత్తు పెట్టుకుందామని బ్రతిమలాడుకోసాగారు. అప్పుడు చంద్రబాబు... మీతో పొత్తు పెట్టుకోవడం వల్ల నాకొచ్చే ఉపయోగమేమీ లేదు. అనవసరంగా మైనార్టీలు మా పార్టీకి దూరమవుతున్నారు. అయినా మీరు ఇంతగా బ్రతిమలాడుతున్నారు కాబట్టి, పొత్తు విషయం ఆలోచిస్తాలే అని చెప్పాడు. అప్పుడు అద్వానీ... మీరు ఆలోచిస్తాను అన్నారంటే కన్‌ఫాం అయిపోయినట్లే... నువ్వు పొత్తు పెట్టుకోకుంటే మా మీదొట్టు అంటూ అద్వానీ చంద్రబాబు చేయిని తన తలమీద పెట్టుకున్నాడు.

★★★★★

స్క్రీన్ మీద "2009 తర్వాత చంద్రబాబు" అనే టైటిల్‌తో సెకెండ్‌పార్ట్ స్టార్టయ్యింది. దేశంలో నరేంద్ర మోడీ క్రేజ్... ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే పరిస్థితి... తెలంగాణలో టీఆర్‌యస్, కాంగ్రెస్ హవా... సీమాంధ్రలో జగన్ జోరు... రెండు చోట్ల కూడా చంద్రబాబు దివాళా. బీజేపీతో పొత్తు పెట్టుకుంటేగాని లాభం లేదనుకున్న చంద్రబాబు నేరుగా ఢిల్లీలోని బీజేపీ ఆఫీసు వద్దకు వెళ్లాడు. ఆఫీసులోపల అద్వానీ, రాజ్‌నాథ్ సింగ్‌లు కూర్చుని వున్నారు. ఆఫీసుబాయ్ వచ్చి... సార్, మిమ్మల్ని కలవడానికి చంద్రబాబు వచ్చారని చెప్పాడు. అద్వానీ వుండి... లోపల మేం లేమని చెప్పి పంపించు అని చెప్పాడు. వెంటనే ఆఫీసు బాయ్ బయటకు వచ్చి, సార్ వాళ్లు లోపల లేమని చెప్ప మన్నారండి అని చంద్రబాబుతో చెప్పాడు. ఆ మాట వినగానే చంద్రబాబు సర్రున లోపలకు వెళ్లాడు. వెంటనే అద్వానీ రెండు చేతులు పట్టుకుని ఇవి చేతులు కావు, కాళ్లనుకోండి... మీరు నన్ను కావాలని దూరంగా పెడుతున్నారు. ఈసారికి పొత్తు పెట్టు కుందాం... మీరు కోరినన్ని సీట్లిస్తాను, కోరుకున్న సీట్లి స్తాను, దయచేసి పొత్తును కాదనకండి... లేకుంటే నా బ్రతుకు బస్టాండవుతుంది అని ప్రాధేయపడ సాగాడు. దానికి వాళ్లు... మాదేముంది చంద్రబాబు, తెలంగాణ, సీమాంధ్రలో మా పార్టీ వాళ్ల అభిప్రాయా లను తెలుసుకుని నిర్ణయం చెబుతామన్నారు.

అప్పుడే అక్కడకు కిషన్‌రెడ్డి, హరిబాబు వచ్చారు. టీడీపీతో పొత్తు ప్రస్తావనరాగానే వాళ్లిద్దరూ కంబైన్డ్‌గా... నో... అని అరిచారు. టీడీపీతో పొత్తు అంటే మనం తయారు చేసిన తాడుతో మనం ఉరి వేసుకోవడమే... వద్దనే వద్దన్నారు. వెంటనే చంద్రబాబు వాళ్లిద్దరి చేతులు గట్టిగా పట్టుకుని మీరు అంత మాట అనొద్దు... మీకు ఏం కావాలన్నా చేస్తాను, ఈసారికి మాత్రం పొత్తుకు ఒప్పుకోండి, మీరు ఒప్పుకోకుంటే ఈ క్షణం నుండి అన్నం నీళ్లు మానేసి నిరాహారదీక్ష చేస్తానన్నాడు. దాంతో అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్‌లకు జాలేసి, ఎంతైనా ఒకప్పుడు మనతో కలిసున్నోడే కదా... పాపం ఈసారికి మన్నిద్దాంలే అని చెప్పి పొత్తుకు పచ్చ జెండా వూపారు.

ఇక్కడితో ల్యాప్‌టాప్‌లో సీన్‌లు అయిపోయాయి. అప్పుడు భేతాళుడు... చూసావుగా విక్రమార్క, 2004కు ముందు చంద్రబాబుతో పొత్తు కోసం బీజేపీ వాళ్లు వెంటపడ్డారు. ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం కోసం చంద్రబాబు వారి ముందు మోకరిల్లాడు. బండ్లు ఓడలు కావడమంటే ఇదేనేమో... చంద్రబాబు ఈ పరిస్థితికి రావడానికి కారణమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోయావో టీడీపీ-బీజేపీ అలయన్స్‌తో సీటును కోల్పోయిన తెలుగుదేశం నాయకుడిలా తయారవుతావని హెచ్చరించాడు. దానికి విక్రమా ర్కుడు... భేతాళ చంద్రబాబు జాతకచక్రంలో సొంతంగా అధికారం సంపాదించే మార్గం లేదు. 1995లో ఎన్టీఆర్‌ను దించడం ద్వారా సీఎం అయ్యాడు. 1999లో వాజ్‌పేయి సానుభూతి ఓట్లతో మళ్లీ సీఎం అయ్యాడు.

ఇప్పుడు నరేంద్ర మోడీ ఇమేజ్ ఓట్లతో తన జాతకం మారుతుందేమోనని చూస్తున్నాడు. కాబట్టే బీజేపీతో పొత్తుకు ఇంత హైరానా పడ్డాడని చెప్పాడు. ఆ సమాధానంతో సంతృప్తి చెందిన భేతాళుడు బాడీని విక్రమార్కుడి వద్దే వదిలేసి వైఎంసిఏ గ్రౌండ్‌లో వున్న దూరదర్శన్ టవర్ ఎక్కేసాడు.

★★★★★

## కదంబం

## చిక్కబడుతూనే...!

వై.హెచ్.కె.మోహన్‌రావు
పిడుగురాళ్ళ, 94401 54114.

కొన్ని జ్ఞాపకాలు
కాలంతో పాటు కనుమరుగౌతాయి
శిశిరంలో ఆకుల్లా రాలిపోతాయి
ఆకారాలు దగ్గరౌతున్నా
అంతరంగాలు సుదూరంగా జరుగుతూ
అస్పష్టంగా పరుగులు తీస్తుంటాయి
కొన్ని స్మృతులు
భవిష్యత్‌తో పెనువేసుకుంటాయి
బంధాలను మోసుకుంటూ
అభిమానపు లతలు అల్లుతుంటాయి
ఎల్లప్పుడూ చిగురులు తొడుగుతూనే ఉంటాయి
విరిసిన పువ్వుల్లా
పరిమళాలు చిలకరిస్తుంటాయి
వాత్సల్యపు చూపులతో మళ్ళీ మళ్ళీ
పలకరిస్తూ చిక్కబడుతుంటాయి
దూరమైన కొలదీ మరింత పదిలమౌతుంటాయి
విడదీయలేని అనుబంధాల చిక్కుముడులు
వేస్తూనే వుంటాయి
ఒక్కో సందర్భంలో
అది ఆరాధనా భావమై అలరారుతుంది
జ్ఞాపకాల పడమటి తలుపులు మూసుకున్నా
అనుభవాల తూర్పు వాకిలి నుండి ఆ స్మృతులు
తొంగి చూడటం సహజమే కదా!
ఆకాశంలో ఆదిత్యుడు అదృశ్యమౌతాడా!
భూమి తన గమనం మార్చకుండా వుంటే!

## నగరమంతా శ్రీ సీతారాముల కల్యాణ వైభోగమే



నెల్లూరు నగరంలోని అన్ని ఆలయాలు శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 8న శ్రీ సీతారాముల కల్యాణంతో కళకళలాడాయి. పణతులవారి వీధిలోని సీతారామ మందిరంలో మువ్వల రాంబాబు నేతృత్వంలో ఉదయం కల్యాణం జరుగగా సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణాన్ని కన్యకాపరమేశ్వరి సత్సంగం భక్తిశ్రద్ధలతో నిర్వహిం చింది. ఇస్కాన్‌సిటీలోని ఇస్కాన్ కృష్ణమందిరంలో సీతారాముల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. సుఖదేవస్వామి పర్యవేక్షణలో భజనలు, కీర్తనలు, హారతి, అభిషేకాలు జరిపి శ్రీరామ కథను వినిపించారు. తదుపరి స్వామికి పుష్పాభిషేకం ఘనంగా నిర్వహించారు. దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో కల్యాణవేడుక కమనీ యంగా సాగింది. రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథుని ఆలయంలో కోదండ రామునిగా దర్శనమిచ్చిన స్వామికి ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో విశేషపూజలను నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని ఉభయకర్తలైన గుళ్ళపల్లి శ్రీధరరావు దంపతులు ఘనంగా జరిపారు. మూలాపేటలోని బెస్తపాళెంలోగల రామాలయంలో సీతారాముల కల్యాణం గొల్లశేఖర్‌బాబు, గొల్ల సుబ్బారావుల పర్యవేక్షణలో భక్తులకు కనువిందు చేసింది. వేదాయపాళెంలోని శ్రీ త్యాగరాజస్వామి దేవస్థానంలో దేవాలయ ట్రస్టీ డాక్టర్



యనమండ్ర నాగదేవీప్రసాద్, శ్రీమతి శైలజ, మాచవోలు రమేష్, మల్లిఖార్జున ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిపారు. అలాగే నగరం లోని పలు ఆలయాలలో సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు.

రాజుకు ఖజానా లాగా...

## భాషకు నిఘంటువు అవసరం

- ఆచార్య రవ్వా శ్రీహరి



నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 9న పుర మందిరంలో నేలనూతల శ్రీకృష్ణ మూర్తి స్మారకోపన్యాస సభ జరిగింది. సభలో పాల్గొన్న తిరుమల తిరుపతి దేవస్థానాల ప్రచురణల ముఖ్య సంపాదకులు ఆచార్య రవ్వా శ్రీహరి మాట్లా డుతూ నేలనూతల శ్రీకృష్ణమూర్తి గొప్పతనాన్ని, సాహితీ కృషిని తెలిపారు. నిఘంటువులు గురించి వివరిస్తూ తెలుగుభాషలో పదసంపదనంతా ఒక్కచోట చేర్చి ఒక మహానిఘంటువును నిర్మాణం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని పేర్కొన్నారు. ఒక రాజుకు ఖజానా ఎటువంటిదో ఒక భాషకు నిఘంటువు అటువంటిదని అన్నారు. అకారాది క్రమంలో వచ్చిన తెలుగు నిఘంటువుల్లో శబ్దరత్నాకరం, సూర్యారాయాంధ్ర నిఘంటువు మొదలైనవి గణనీయమైనవని తెలిపారు. కార్యక్రమంలో వేదం వెంకట్రామన్, వంటేరు వెంకటకృష్ణారెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, మోపూరు వేణుగోపాలయ్య, యం.రామచంద్రప్రసాద్, డాక్టర్ పి.మధు సూదనశాస్త్రి, ఎన్.సుందరబాబు, కళాంజలి అనంత్, ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## గుర్రాల రమణమ్మ సాహితీ పురస్కారాలు

ఈ నెల 13వ తేదీ ఉదయం 9.30గంటలకు నెల్లూరు దర్గామిట్టలోని ఐఎంఏ హాల్‌లో గుర్రాల రమణమ్మ 9వ వార్షిక స్మారక సాహితీ పురస్కారాల సభ జరుగుతుందని జి.ఆర్.ట్రస్ట్ అధ్యక్షులు గుర్రాల రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తూములూరి రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఊసల రజనీ గంగాధర్, వి.రంగరాజు, యన్.వి.రఘువీరప్రతాప్, ఎస్.ఎం.రఫి, ఆత్మకూరు రామకృష్ణ, శ్రీమతి పి.అరుణజ్యోతి, వకుళాభరణం సుధీర్‌బాబు, కనుమూరి లావణ్య, కరేటి అమరజీవి, బి.వి.వినోద్‌కుమార్‌లకు సాహితీపురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఖర్చులు పెరిగి ఆందోళన ఎక్కువగా ఉంటుంది. ఆదాయవ్యయాలకు పొంతన ఉండదు. వ్యాపార అవకాశాలు వెనుకబడగలవు. వృత్తిజీవనం ప్రోత్సాహ కరంగా ఉంటుంది. పెండింగ్‌లోగల పనులు మరలా కొనసాగుతాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. ఇంట బయట వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. విద్యార్థులకు అవకాశాలు బాగుంటాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

సంపాదన బాగుండినా శ్రమ అసంతృప్తి ఎక్కువగా ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం దైవకార్యాలలో ప్రముఖంగా పాల్గొని సహాయపడటం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం బాగుండి రాబడి పెరుగుతుంది. అయితే చెల్లింపులు పన్నులకై డబ్బు వ్యయము కాగలదు. ఉద్యోగ బాధ్యతలలో ఏకాగ్రత ముఖ్యము. క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. దైవకార్యాలకు మంచి పనులకు వితరణ ప్రదర్శిస్తారు. స్థిరాస్తుల లావాదేవీలపై శ్రద్ధ చూపుతారు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు. శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును. కమిటీలు, సమావేశాలలో మీ సూచనలకు సమర్ధన బాగుంటుంది. ఉద్యోగులకు ప్రయాణాలు అదనపు బాధ్యతలు తప్పవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి ఉపాధి రంగాలలో స్థిరపడతారు. వ్యాపార వర్గాలకు అవకాశాలు బాగుండి ఆదాయము పెరుగుతుంది. వృత్తి జీవనంలో అవకాశాలు బాగుండి సంపాదన పెరుగుతుంది. అదనపు ఖర్చులు పెరిగినా తట్టుకొని నిలబడతారు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆత్మీయులతో సంప్రదింపులుంటాయి. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు చేయడం జరుగుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు ప్రభుత్వము నుండి చెల్లింపులు ఆలస్యం కాగలవు. బంధువర్గముఖ్యులకు సంబంధించిన అనారోగ్య వార్తలువింటారు. వ్యాపారవర్గాలకు మంచి ఆర్థికావకాశాలు వాయిదాపడతాయి. ఆదాయానికి లోపం లేకపోయినా అదనపు ఖర్చులు తప్పవు. శుభకార్యాలలో పాల్గొంటారు. దూరప్రయాణాలు జరుగగలవు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోపం పట్టుదల తగ్గించుకొని అందరితో సర్దుబాటు చేసుకొని పోవడం మంచిది. సభలు సమావేశాలలో మీ సూచనలు సలహాలకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరిగి ఆదాయము బాగుంటుంది. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వస్తు వాహన రిపేర్లుండగలవు. ఆర్థిక ఒడుదుడుకుల నుండి బయటపడతారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 11.04.2014 నుండి తేది. 17.04.2014 వరకు**

ఈ వారము మిథునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు. కుంభంలో శుక్రుడు, మీనంలో రవిబుధులు, 14వతేది నుండి మేషంలో రవి, సింహకన్యతులవృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము: 14 సోమవారము సూర్యుని మేష సంక్రమణం తమిళ ఉగాది.

ముహూర్తము: తేది 13 ఆదివారం ఉదయం గంట 9.30నుండి 11.30లోగా మిథునలగ్నము. వివాహ వ్యాపార ఉపనయన అక్షరారంభములు. తేది 16 బుధవారము ఉదయంగంట 9.17నుండి 11.22లోగా మిథునలగ్నమున గృహారంభ వ్యాపార, వివాహ అన్నప్రాశనములు.

**చైత్ర మాస శుక్ల పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | ఏకాదశి | ఉ॥గం9.04వ॥ |
| తేది. 12 | శని | ద్వాదశి | ఉ॥గం10.43వ॥ |
| తేది. 13 | ఆది | త్రయోదశి | ఉ॥గం.11.57వ॥ |
| తేది. 14 | సోమ | చతుర్దశి | మ॥గం.12.45వ॥ |
| తేది. 15 | మంగళ | పూర్ణిమ | మ॥గం.1.00వ॥ |

**చైత్ర మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 16 | బుధ | పాడ్యమి | మ॥గం.12.45వ॥ |
| తేది. 17 | గురు | విదియ | మ॥గం.12.01వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక విషయాలలో నిర్ణయాలు తీసుకొనేటప్పుడు జాగ్రత్తపడండి. వృత్తిపరంగా ప్రాముఖ్యం బాగుండి అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. బాకీలు వసూళ్లు, ఇతర సాంఘిక వ్యవహారాలలో లౌక్యంగా ఉండి జాగ్రత్తపడాలి. వ్యాపారవర్గాలకు అవకాశాలు తప్పిపోవచ్చును. శుభకార్యములకై ఖర్చులు, ప్రయాణ ఖర్చులుండినా ఇబ్బందిపడతారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయవ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపారరంగాల వారికి అభివృద్ధి రాబడి బాగుంటుంది. స్థిరాస్తుల వ్యవహారాలు మధ్యవర్తుల ద్వారా సర్దుబాటు చేసుకొనడం మంచిది. ఉద్యోగులకు అదనంగా బాధ్యతలుంటాయి. అందుకని అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండండి. యాజమాన్యాలకు వర్కర్లతో సమస్యలుండగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

చేపట్టిన పనులందు ముందుకు సాగుతారు. ప్రజాదరణ రాజకీయ పలుకుబడి బాగుంటుంది. ఆర్థికలావాదేవీలందు ప్రతిభ చూపుతారు. వృత్తి వ్యాపారాలు ప్రగతిపథంలో సాగి, ఆదాయం పెరుగుతుంది. విమర్శించిన వాళ్లే మీ వైపుకు చేరతారు. విలువైన వస్తువులు, వస్త్రాభరణాలు సమకూర్చుకొంటారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికాభివృద్ధికి కొత్త ఆలోచనలు, ప్రణాళికలు రూపొందిస్తారు. అనుకున్న పనులు పూర్తిచేయడానికి డబ్బు పలుకుబడి ఉపయోగిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి పెరిగి ఆదాయం పెరుగుతుంది. బిడ్డలు, బంధువుల వల్ల కొంత ఇబ్బందిపడతారు. శుభకార్య నిర్ణయాలు జరగడం, శుభకార్యములలో పాల్గొనడం జరుగుతుంది. విద్యావకాశాలు బాగుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

స్థిరాస్తుల లావాదేవీలు ప్రక్కనపెట్టండి. వాహనాలు నడిపేవారు కరెంటు పనులు, యంత్రాల పనులు చేసేవారు మెలకువగా ఉండండి. వృత్తిపరంగా ప్రాపకం బాగుండి ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు కొద్ది ఆర్థిక ఇబ్బందులుండి ఋణాలు చేయవలసి రావచ్చు. క్రొత్త పెట్టుబడులకు, వ్యాపార ప్రారంభాలకు ప్రయత్నాలు చేస్తారు. దైవకార్యాలలో పాల్గొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులను పట్టుదలతో నెరవేరుస్తారు. వృత్తి వ్యాపారాల విస్తరణ, ఆదాయవృద్ధి ఉంటుంది. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాలకు అనుకూలత ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం, వివాహాది శుభకార్యాలు నిర్ణయంకావడం జరుగుతుంది. సంతాన విషయంలో శుభపరిణామాలుంటాయి. అధికారులకు పర్యటనలు, తనిఖీలు ఎక్కువగా ఉంటాయి.

# ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరగాలి





కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఈనెల 7న జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏ.బి.ఎం కాంపౌండులో డిఎంహెచ్ఓ డాక్టర్ కోటేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. ఏడిఎం హెచ్ఓ డాక్టర్ పద్మావతి, డిటీసిఓ డాక్టర్ సురేష్‌కుమార్, రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్, జిల్లా మలే రియా అధికారి వేణుగోపాల్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజింగ్ అధికారి డాక్టర్ పెంచలయ్య, డిఎస్ఆర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఠాగూర్, ఎస్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. తదుపరి నెల్లూరు పుర మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పాల్గొని మాట్లాడుతూ 1960 సంవత్సరంలో ప్రజారోగ్యంపై భారత్, చైనా, థాయ్‌లాండ్ దేశాలు ఒకే దశలో వున్నాయని, కాని నేడు చైనా, థాయ్‌లాండ్‌లు ప్రజారోగ్యంలో పాతికేళ్ళు ముందుకు దూసూకుపోయి ప్రగతిని సాధించాయన్నారు. కారణం ఆ రెండు దేశాల్లో ఆరోగ్యంపై, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన పెరిగి సరైన జాగ్రత్త చర్యలు పాటించడమేనన్నారు. కలుషిత నీరు, అపరిశుభ్రత వల్లే కీటకాల ద్వారా అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, అలా కాకుండా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, నీరు పరిశుభ్రంగా వుండేలా ప్రణాళికను ఏర్పరచుకొని తగుచర్యలు అధికారులు తీసుకోవాలన్నారు.

# ప్రపంచంలోనే అగ్రగామిగా భారతదేశం



జెండాను ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 6న బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడుతూ ప్రపంచంలోనే అగ్రగామిగా భారతదేశాన్ని నిలపాలనే ధ్యేయంతో బిజెపి పనిచేస్తుందని పేర్కొన్నారు. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో బిజెపిని గెలిపించాలని, తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నగర అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గడ్డం విజయ్‌కుమార్, శ్రీనివాసులు, రాజేష్, సురేష్, శాంతమ్మ, రాజేంద్ర, మధు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుపై పడ్డారు

రెండోదశ ప్రాదేశిక ఎన్నికల నిర్వహణలో భాగంగా 9వ తేదీ సాయంత్రం నుండి 11వ తేదీ సాయంత్రం 7గంటల వరకు 25మండలాలలో వైన్‌షాపులు, బార్‌లు మూసేసారు.

నెల్లూరు నుండి తడ వరకు 25 మండలాల్లో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మద్యం దుకాణాలు బంద్ చేయడంతో మందుబాబులు అల్లాడిపోయారు. పలు రాజకీయపార్టీల అభ్యర్థులు ముందుచూపుతో ముందుగానే మద్యం నిల్వలు పెట్టుకుని మందుబాబులకు ఆ లోటులేకుండా చూసారు. ఇంకొందరు మాత్రం నెల్లూరు, పెన్నా అవతల మండలాల్లో మద్యంషాపులు తెరచి ఉంచడంతో అక్కడకు పోయి తాగడం, లేదంటే అక్కడ నుండి మద్యాన్ని చాటుమాటుగా తెచ్చుకోవడం చేసారు. పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేసి మద్యం అక్రమరావాణాను అడ్డుకున్నా అడ్డదారుల్లో కొంత మద్యం రవాణా జరిగింది.

# నాణ్యత లేని డివైడర్లు

నెల్లూరు భక్తవత్సలనగర్ మినీబైపాస్‌రోడ్డుపై ఈ నెల 7న తెలుగుదేశంపార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి డివైడర్ల నిర్మాణ నాణ్యతలేమిపై టీడీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైడర్లు చేతులతో తోస్తే పడిపోయేలా నాసిరకంగా నిర్మిస్తున్నారని, నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి అండతో బినామీ కాంట్రాక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీహరి ఇలా నిర్మించడం సబబు కాదని పేర్కొన్నారు. ఆనం వివేకానందరెడ్డి అక్రమంగా కార్పొరేషన్‌ను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, బొల్లినేని శ్రీహరినాయుడు, మన్నెం పెంచలయ్య, మాదాల మల్లిఖార్జున, పినిశెట్టి సురేష్, నెల్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పందేలరాయుళ్ల అరెస్ట్

క్రికెట్ పందేల మాఫియా నెల్లూరు నగరంలోనూ వేళ్లూనుకుంది. ఒకప్పుడు స్థానికంగా పరిమితమైన పందేలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగాయి. నెల్లూరును కేంద్రంగా చేసుకుని జిల్లాలో పెద్దఎత్తున క్రికెట్ పందేలు నిర్వహిస్తున్న లోకల్ క్రికెట్ బుకీలను నెల్లూరు నాలుగో నగర పోలీసులు అరెస్ట్ చేసారు. సోమవారం నాలుగోనగర సిఐ రామారావు దీనికి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈమధ్య టీ-20వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరిగే సందర్భంలో నెల్లూరు హరనాథపురంలోని సాయి బృందావనం అపార్ట్‌మెంట్‌లో షేక్‌షంషీర్ అనే ప్రధాన క్రికెట్ బుకీ మరికొందరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని పెద్దఎత్తున పందేలు నిర్వహించసాగారు. ఈ సమాచారం పోలీసులకు చేరింది. నగర డిఎస్పీ వెంకటనాథ్ ఆదేశాలతో నాలుగో నగర పోలీసులు ఈ నెల 5వ తేదీ రాత్రి పందేల సెంటర్‌పై దాడి చేసారు. వీరి దాడిలో ఆరుగురు సబ్‌బుకీలు, పలువురు పంటర్లు దొరికారు.

వీరిని విచారించగా ప్రధాన బుకీ షంషీర్ అని తేలింది. పట్టుబడిన వారి సెల్‌ఫోన్స్ కాల్‌లిస్ట్ ఆధారంగా మరికొన్ని వివరాలు సేకరించారు. ఈ నెల 6వ తేదీ రాత్రి మూలాపేట రొట్టెల వీధిలో ఉంటూ ఇండియా - శ్రీలంక ఫైనల్ మ్యాచ్‌పై పందేలు కాస్తున్న సమయంలో పోలీసులు దాడిచేసి షంషీర్, షంషుద్దీన్, జహీర్‌లను అరెస్ట్ చేసి వారి నుండి 40వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరి సెల్‌ఫోన్‌లోని నెంబర్లను పరిశీలిస్తే వీరికి హైదరాబాద్, చెన్నై, కాకినాడ, విజయవాడ, బెంగుళూరులలో వుంటున్న బుకీలతో సంబంధాలున్నాయని తేలింది.

నగరంలో పలువురు ప్రముఖులు సైతం షంషీర్ ద్వారా క్రికెట్ పందేలు పెడుతుండడం బయటపడింది. పోలీసులు పట్టుబడ్డ నిందితులపై ఏపి గేమింగ్‌యాక్ట్ క్రింద కేసు నమోదు చేసారు.

# ఓటింగ్ శాతం పెంచండి

**- జాయింట్ కలెక్టర్ రేఖారాణి**



ఓటరుగా నమోదైన ప్రతి పౌరునికి ఖచ్చితంగా ఓటరు స్లిప్ అందజేసి ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని జాయింట్ కలెక్టర్ రేఖారాణి పేర్కొన్నారు.

బుధవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాలులో బూత్‌స్థాయి మరియు సంబంధిత అధికారులతో ఓటింగ్ స్లిప్‌లు పంపిణీపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రధానంగా గ్రామ ప్రాంతాలలో కంటే పట్టణాలలో ఓటింగ్ శాతం తక్కువగా వుంటుందని, కనుక గణనీయమైన ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి తమ ఓటు హక్కును పూర్తి స్థాయిలో వినియోగించుకొనేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియలో పోలింగ్ స్టేషన్లవారీగా ఓటర్ల జాబితా తీసుకొని సంబంధిత బూత్‌స్థాయి అధికారుల సమన్వయంతో బూత్‌ల వారీగా ఓటరు స్లిప్‌ల పంపిణీపై సమీక్షించుకొని ఓటరు జాబితా ప్రకారం ఓటర్లకు పూర్తిస్థాయిలో స్లిప్‌లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు వారివారి పరిధిలోని ఓటర్ల జాబితా ప్రకారం ఇంటింటికెళ్లి ఓటరు స్లిప్‌లను అందించి ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. ఓటర్ల స్లిప్ అందజేయడంతో ప్రతి ఓటరు పోలింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రక్రియలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ ఎల్.విజయకుమార్, ఆర్.డి.ఓ ఎస్.నాగేశ్వరరావు, ఆర్.డి.ఓలు సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరావు, ఐసిడియస్ పిడి విజయలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

# తప్పుకోవడమే!

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబుకు ఓటు పెరగలేదు. కాని ఆదాల రంగంలోకి దిగాక చాలావరకు పరిస్థితుల్లో మార్పు తెచ్చాడు. ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చేరికతో నెల్లూరు నగరంలో తెలుగుదేశాన్ని బలోపేతం చేసాడు. కోవూరులో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని చేర్చి అక్కడా పార్టీని పటిష్టం చేసాడు. ఉదయగిరిలో పార్టీ బలహీనంగా ఉంటే మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో పాటూ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, కావేరి కృష్ణారెడ్డి, ఇంకా మరికొంత మంది కాంగ్రెస్ నాయకులను తెలుగు దేశంలోకి తీసుకువచ్చి ఇక్కడా పార్టీని గట్టిగా నిలబెట్టాడు. పార్లమెంటు పరిధి లోకి వచ్చే 7అసెంబ్లీల్లో ఆత్మకూరు ఒక్కటే ఆయనకు సమస్యగా మారి ఉండింది. ఇక్కడ బలమైన నాయకత్వం కోసం వెదుకుతున్న సమయంలో చంద్రబాబు ఆయనకు నెల్లూరురూరల్ రూపంలో సమస్య తెచ్చిపెట్టాడు. ఆదాల ఇక్కడ నుండి సోమిరెడ్డిని పోటీ చేయించాలనే ఆలోచనతో ఉన్నారు. సోమిరెడ్డి దిగితే గట్టిపోటీ ఉంటుందని, లోక్‌సభకు కూడా కలిసొస్తుందని ఆదాల ఆలోచన. కాని చంద్రబాబు దానిని బీజేపీకి వదిలేసాడు. దీంతో టీడీపీ కేడర్ నీరస పడింది. ఆదాల డీలా పడ్డాడు. ఒక్కో సెగ్మెంట్‌ను ఆదాల సరిదిద్దుకుంటూ వస్తుంటే, బాగావున్న సెగ్మెంట్‌ను చంద్రబాబు చెడగొట్టాడు. నెల్లూరురూరల్ సీటు బీజేపీకిస్తే వైకాపా అభ్యర్థికి గెలుపు నల్లేరు మీద నడకే! పార్లమెంట్‌కు కూడా ఇదే విధంగా ఓటింగ్ ఉంటుంది. ఈ భయంతోనే ఆదాల నెల్లూరురూరల్ సీటు నుండి బీజేపీని తప్పించి సోమిరెడ్డిని పోటీ చేయించాలని పోరాడుతున్నాడు. ఒకవేళ రూరల్ నుండి బీజేపీని తప్పించకుంటే పోటీ నుండి ఆదాల తప్పుకోవచ్చుననేది సమాచారం.

# బీజేపీ షాక్

(2వపేజీ తరువాయి)

ఉంటుందనుకున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో గట్టి అభ్యర్థులు పడి నువ్వా-నేనా అన్నట్లు పోటీ ఏర్పడితే పార్లమెంటుకు ఖచ్చితంగా నరేంద్ర మోడీ ఇమేజ్‌తో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని ఆయన ఆలోచించారు. సిట్టింగ్ ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి పట్ల వ్యతిరేకత వుంది కాబట్టి ఎంత జగన్ హవా వున్నా మోడీ క్రేజ్‌తో గెలుపుకు దగ్గర కావచ్చనేది ఆదాల అంచనా! అయితే బీజేపీకి రూరల్ కేటాయించడంతో ఈ అంచనాలన్నీ తలక్రిందులయ్యాయి.

## కాలధర్మం

# జిలుమూడి కళావతి



నవయుగ ఇన్ఫోటెక్‌లో సిఇఓగా పనిచేసిన పిడతా పోలూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి సోదరీమణి శ్రీమతి జిలుమూడి కళావతి మార్చి31వతేదీన అనారోగ్యంతో కనుమూసారు. ఆమె నెల్లూరురూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డికి స్వయాన బావమరిది భార్య. ఆమె వయసు 60సంవత్సరాలు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంగం మండలం దువ్వూరు స్వగ్రామం. గతంలో కోరిన మేరకు ఆమె అంత్యక్రియలను కుటుంబసభ్యులు వారణాసిలో పవిత్ర గంగానది ఒడ్డున నిర్వహించారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# శ్రీ వైష్ణవి ఫిలిం ఫ్యాక్టరీ శ్రీరామనవమి పురస్కారాలు



వల్లకవి సుబ్బారావును 'నటస్వర్ణోత్సవ చక్రవర్తి' బిరుదుతో సత్కరిస్తున్న ముఖ్యఅతిథులు



'ఆరోగ్యస్ఫూర్తిప్రదాత' బిరుదునందుకుంటున్న రమేష్

ఉగాది, శ్రీరామనవమి పర్వదినాల సందర్భంగా ఈనెల 8న నెల్లూరు పుర మందిరంలో శ్రీ వైష్ణవి ఫిలిం ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో పలురంగాల్లో విశిష్టసేవలు అందించిన వ్యక్తులను గౌరవంగా సత్కరించారు. రంగస్థల నటనలో యాభై వసంతాలు పూర్తిచేసుకున్న వల్లకవి సుబ్బారావుకు "నటస్వర్ణోత్సవ చక్రవర్తి" బిరుదు, అత్యాధునిక వైద్యసేవల పరిజ్ఞానాన్ని జిల్లావాసులకు చేరువచేసిన సోమిశెట్టి వెంకటరమేష్‌కు "ఆరోగ్య స్ఫూర్తిప్రదాత" బిరుదులు ప్రదానం చేసి శాలువా, పుష్పమాల, సన్మానపత్రంలు సమర్పించి ఘనంగా సన్మానించారు. వీరితోపాటు సాహిత్యంలో విశిష్ట ప్రతిభ కలిగిన కవి ఏటూరు నాగేంద్ర, సేవారంగంలో నీలం పద్మావతి, అర్చకత్వంలో తెనాలి అనంతశర్మ, కవిత్వంలో శానంపూడి కృష్ణయ్య, ఉపాధ్యాయ వృత్తిలో తాటిపర్తి వెంకటేశ్వర్లు, షార్ట్ ఫిలిందైరెక్టర్ ఆశీష్‌జి రెమో, రంగస్థల నటనలో షేక్ చినమీరా, వాడపల్లి ఆంజనేయులు, తోట పద్మనాభయ్య, నెల్లటూరు నారాయణ, సంగీతంలో జక్కంపూడి కొండయ్య నాయుడు తదితరులను సమ్ముచితంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, దగ్గుపాటి రాధాకృష్ణ, శింగంశెట్టి మురళీమోహన్, ఓజిలి సునందమ్మ, సర్వేపల్లి రామ్మూర్తి, ఒమ్మిన నాగసతీష్, బి.వి.నరసింహం, కళాంజలి అనంత్, వైష్ణవి ఫిలిం ఫ్యాక్టరీ నిర్వాహకులు వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాకర్స్ శ్రీరామనవమి వేడుకలు



విజేతకు బహుమతినందజేస్తున్న బలరామయ్యనాయుడు

నెల్లూరు పొదలకూరు రోడ్డులోని జిల్లా ప్రజావాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీరామునికి నివేదించిన వడపప్పు, పానకం సభ్యులందరికీ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా బి.రామిరెడ్డి రచించిన శ్రీరాముని స్తుతి పద్యాలను టి.వి.రమణయ్య వినిపించారు. సాయంత్రం చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన అందరినీ అలరించింది. చెలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సంఘం నిర్వహించిన క్రీడాపోటీలలో విజేతలకు బహుమతులను ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఇంటర్నేషనల్ వాకర్స్ ఏరియా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నేతాజీ సుబ్బారెడ్డి, మైథిలి మనోహర్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, తుంగా నారాయణరెడ్డి, ఆదినారాయణలు అందించారు.

ఈ సందర్భంగా ఆదర్శ దంపతులుగా ఎంపికైన బిరుదవోలు రామిరెడ్డి, సుశీలమ్మలను, 75 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్స్ పెంచలయ్య, వెంకటేశ్వరరావు, చెంచయ్య, తిరువళ్ళూరు, సుబ్బారావు, రమణారెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మండవ శ్రీనివాసరావు, సభ్యులు ఓ.సుబ్బరాయుడు, యం.వి.కృష్ణయ్య, శ్రీధర్, నాగేశ్వరరావు, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, మురుగన్, కవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పురుషుడు శ్రీరాముడు

నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్‌లో చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న "శ్రీరామ నవమి" వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా సీతాశ్రీరామ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి తీర్థప్రసాదాలతో పాటు విసనకర్రలను కూడా భక్తులకు పంచిపెట్టారు. ఈ వేడుకలలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, టి.వి.ఆర్టిస్ట్ శింగంశెట్టి మురళీమోహన్‌రావు, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కొట్టే రామ్మూర్తి, పరవేశి రఘు, కె.వి.ఎస్.నాయుడు, సురేష్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్‌నాయుడు, డాక్టర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# వార్ వన్‌సైడ్

(మొదటిపేజీ తరువాయి)

కరవు... సీమాంధ్రలో మాత్రం అభ్యర్థుల కరువు. తెలుగుదేశంలో చూస్తే... ఇరు ప్రాంతాలలోనూ టిక్కెట్లకు కొట్లకుంటున్నారు. టీఆర్ఎస్‌లోనూ గొడవలే!

ఒక్క వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో మాత్రం టిక్కెట్ల కోసం సిగపట్లు లేవు, రెబల్స్ బెడద లేదు. తెలంగాణలో ఎటువంటి రచ్చలు రావిళ్లు లేకుండా అన్ని స్థానాలకూ జగన్ అభ్యర్థులను ప్రకటించేసారు. రేపు సీమాంధ్రలో కూడా ఇదే విధంగా చేయబోతున్నారు. అయినా పార్టీలో రెబల్స్, అసమ్మతి వంటి సీన్‌లు ఉండవు. దీనికి కారణం నాయకులను పార్టీలోకి చేర్చుకునేటప్పుడు జగన్ ముందు చూపుతో వ్యూహాత్మకంగా వ్యవహరించడమే. చంద్రబాబు లాగా జగన్ కూడా పార్టీ గేట్లు ఓపెన్ చేసుంటే కాంగ్రెస్ నుండి నాయకులు మందలు మందలుగా చేరేవాళ్లు. కాని జగన్ ఆ పని చేయలేదు. పార్టీలో స్వచ్ఛందంగా వచ్చి చేరేవాళ్లను చేరమన్నాడు. ఎవరికీ సీట్ల గ్యారంటీ ఇవ్వలేదు. పార్టీ సర్వేలో ఎవరు తేలితే వారే అభ్యర్థి అని ముందుగానే చెప్పేసాడు. ఏడాది క్రితమే దాదాపు అన్ని నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ప్రకటించి ఉన్నాడు. వాళ్లే అభ్యర్థులనేది కూడా తేలిపోయింది. ఏ నియోజకవర్గంలోనూ సీటు కోసం రెండో నాయకుడిని పోటీలో పెట్టలేదు. దానివల్లే ఈరోజు వైకాపాలో సీట్ల తలనొప్పులు లేవు. పార్టీ ప్రశాంతంగా వుంది. జగన్ అభ్యర్థులను ఇంతకు ముందే డిసైడ్ చేసి వుండడంతో ఎన్నికల యుద్ధానికి ప్రశాంతంగా సిద్ధమయ్యారు.

# 'దేశం' చిత్తు

(మొదటిపేజీ తరువాయి)

నాయకులంతా రాజకీయ పునరావాసం కోసం మొదట వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వైపు చూసారు. అక్కడ హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేయడంతో తెలుగుదేశం వైపు పరుగెత్తారు. ఊహించని విధంగా పార్టీలోకి వలసలు మొదలుకావడంతో చంద్రబాబు ఆనందంగా పార్టీ తలుపులు బార్లా తీసి వారినందరినీ తీసుకున్నారు. తీరా ఎన్నికలు దగ్గరపడి సీట్లు కేటాయించాల్సి వచ్చేటప్పటికి పార్టీనే నమ్ముకుని వున్న పాత నాయకులు, కాంగ్రెస్ నుండి వలసొచ్చిన కొత్త నాయకుల మధ్య తగవులు మొదలయ్యాయి. సీమాంధ్రలో 15అసెంబ్లీ, 5 లోక్‌సభ స్థానాలు బీజేపీకిచ్చారు. మిగిలిన స్థానాలలో చాలావాటిని కాంగ్రెస్ నుండి వలసవచ్చిన వారికి వదులుకోవాల్సి వచ్చింది. దీంతో పార్టీ ప్రతిపక్షంలో వున్న ఈ పదేళ్ల నుండి కష్టపడి పనిచేస్తున్న నాయకులకు టిక్కెట్లు లేకుండా పోయాయని తెలుగుతమ్ముళ్ళు ఆవేదనతో రగిలిపోతున్నారు. పలుచోట్ల పార్టీ కార్యాలయాల మీద ఈ కోపంతో దాడులకు కూడా తెగబడ్డారు. నెల్లూరుజిల్లాలో నెల్లూరు రూరల్ సీటు విషయంలో, ప్రకాశం జిల్లాలో సంతనూతలపాడు సీటు విషయంలో, గుంటూరు జిల్లాలో నర్సారావుపేట సీటు విషయం, కృష్ణాజిల్లాలో విజయవాడ తూర్పు సీటు విషయంలో... ఇలా ప్రతి జిల్లాలోనూ తెలుగుదేశంలో సీటు గొడవలున్నాయి. సీట్లు దొరకని వాళ్లు రెబల్స్‌గా రంగంలోకి దిగేందుకు సిద్ధంగా వున్నారు. బీజేపీతో పొత్తు వల్ల తెలుగుదేశంకు ఓట్లు రావడం మాటేమోగాని రెబల్స్ వల్ల మాత్రం ఉన్న ఓట్లకే తూట్లుపడే అవకాశాలున్నాయి.

## మోడీ కోసం స్మిత ఆల్బమ్




2014 ఎన్నికల్లో తారలు తళుక్కుమని మెరుస్తున్నారు. కొంతమంది తారలు తమకు నచ్చినపార్టీలను ఎంచుకుని ఎన్నికల బరిలోకి దిగుతుంటే, మరికొంతమంది తారలు ప్రచారపరంగా తమకు నచ్చినపార్టీలకు సహకరిస్తున్నారు. ఈ కోవలోనే పాప్ సింగర్ స్మిత, 'వేకప్ ఇండియా' అనే పేరుతో నరేంద్ర మోడీకి మద్దతుగా ఆల్బమ్‌ను రూపొందించారు. ప్రస్తుత రాష్ట్ర, దేశ రాజకీయాలను ప్రతిబింబించేలా ఆమె ఈ పాటను వ్రాసారు. గుజరాత్ డెవలప్‌మెంట్ చూసే ఆమె మోడీ అభిమానయ్యిందట!

## ఏడేళ్ళ క్రితమే కథ విన్నా!



అనుష్క హీరోయిన్‌గా నటిస్తున్న 'రుద్రమ దేవి' సినిమాలో దగ్గుపాటి రానా ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. దర్శకుడు గుణశేఖర్ తనకు ఏడేళ్ల క్రితమే ఈ సినిమా కథ చెప్పాడని, అప్పుడే ఈ సినిమాలో నటించాలని నిర్ణయం తీసుకున్నాని అంటున్నాడు రానా.

## మూ'వీ'క్షణం

అల్లరి నరేష్, పూర్ణ, భూమిక ముఖ్య పాత్రదారులుగా మహారధి ఫిలింమ్స్ పతాకంపై రాజేంద్ర త్రిపురనేని నిర్మించిన క్యామెడీ ఎంటర్‌టేనర్ 'లడ్డుబాబు' ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. రవిబాబు ఈ చిత్రానికి దర్శకుడు. బక్క పల్చటి హీరో నరేష్, ఈ సినిమాలో 268 కేజీల భారీఆకారంతో నటించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని రాజేంద్ర అంటున్నారు. చక్రి స్వరసారధ్యంలో నిర్మించిన ఈ చిత్రం ఆడియో ఇటీవలే విడుదలై శ్రోతలను ఆకట్టుకుంది. ఈ నెల 18న ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక థియేటర్లలో ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, అల్లరి నరేష్ కెరీర్‌లోనే ఈ సినిమా ప్రత్యేకంగా నిలుస్తుందని అంటున్నారాయన.

## 18న వస్తున్న 'లడ్డుబాబు'



## గ్లామర్‌గా కనిపించబట్టే....

నయనతార తన కెరీర్‌లో అన్ని షేడ్స్‌ను చూసారు. తెరంగేట్రం చేసిన కొత్తల్లో ఒంటిమీద బట్టలు బరువన్నట్లుగా నటించారు. శింబుతో లిప్ లాక్‌లు చేసి సంచలనం సృష్టించారు. ఇక శింబు, ప్రభుదేవల ప్రేమాయణం సంగతి సరే సరి! అయితే శ్రీరామరాజ్యంలో సీత పాత్రతో నయన నేపథ్యమే మారిపోయింది. ఇప్పుడు నయన కోసం దర్శకులు ప్రత్యేక పాత్రలే రూపొందిస్తున్నారు. అయితే ఇవన్నీ కూడా ఆరంభంలో తాను అన్నీ విప్పి చూపించడం వల్లే వస్తున్న ఆఫర్లుగా నయన భావిస్తుంది.



# గూడూరు డివిజన్ వార్తలు

## సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

**ఆర్డీవో శ్రీనివాసరావు**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

మే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక సిద్ధంచేసినట్లు ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ చేపడుతామన్నారు. నియోజకవర్గ పరిధిలోని 254 పోలింగ్ కేంద్రాలకు నియమించిన సిబ్బందిని ఇక్కడి నుంచి ఆయా కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలపై సమీక్షించారు. పోలీసు సిబ్బందిని ఆయా కేంద్రాల వద్ద మోహరించి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చూస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, ఆర్.ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి

**దివిపాళెం సర్పంచ్ చంద్రసేన**



గూడూరు రూరల్‌వోని ప్రశాంతినగర్‌లో ప్రచారం చేస్తున్న సర్పంచ్ పిట్టు చంద్రసేన

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని దివిపాళెం పంచాయతీ సర్పంచ్ పిట్టు చంద్రసేన తెలిపారు. దివిపాళెం పంచాయతీలోని మూడు ఎమ్పీటీసీల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పిట్టి రావమ్మ, బట్టేపాటి ఇందిరమ్మ, నాగల కవితతో పాటు జడ్పీటీసీ అభ్యర్థి బొమ్మిరెడ్డి పద్మను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులతో కలసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రసేన మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు.

## బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**- - రూరల్ ఎస్సై హనీఫ్ - -**

బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై హనీఫ్ హెచ్చరించారు. దివిపాళెం పంచాయతీలో సోమవారం సాయంత్రం చవటపాళెం, గాంధీనగర్ ప్రాంతాల్లో సిబ్బందితో కలసి పలు కూల్ డ్రింక్ షాపుల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలు ఊపందుకుంటున్నాయన్న సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో కందలిలో కోకోలు శీనయ్య నుంచి 73క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## మండల పీఠం కోసం పోటాపోటీ

గూడూరు మండల పరిషత్‌కు టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల తరపున అభ్యర్థులు బరిలో ఉన్నారు. నిన్నటి వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంపిపి స్థానానికి అభ్యర్థిని నిలపకపోగా, జడ్పీటీసీ అభ్యర్థిని బరిలోకి నిలిపింది. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పనబాక కృష్ణయ్య శనివారం సాయంత్రం వచ్చి ఎంపిటీసీ ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీచేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ తరపున జడ్పీటీసీ, అభ్యర్థినిగా శ్రీకిరెడ్డి సంగీతను ప్రకటించి ఆమె విజయానికి కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు కృషిచేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఎంపిపి అభ్యర్థినిగా చెన్నూరు-3 సెగ్మెంటు నుండి మధిరశంకరమ్మను గెలిపించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బల్లి దుర్గా ప్రసాద్‌రావు, పార్టీ సీనియర్‌నేత చేవూరి విజయమోహనరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఇక వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నుండి ఎంపిపి అభ్యర్థిగా దివిపాళెం సర్పంచ్ అత్తగారైన పిట్టి రావమ్మను బరిలో నిలిపి ఆమె విజయానికి స్థానిక వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాలరెడ్డి, పాశం సునీల్‌కుమార్, మల్లు విజయకుమార్‌రెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 11న జరగనున్న రెండో విడత ఎన్నికల ప్రచారంలో వైకాపా, టిడిపి నేతలు బిజీగా ఉన్నారు. రాజన్న రాజ్యం రావాలంటే జగన్మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని, తప్పక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నేతలు ప్రచారం చేస్తుండగా, రైతులకు వ్యవసాయ రుణాలు, డ్వాక్రా రుణాలు రద్దు ఒక్క టిడిపి అధినేత చంద్రబాబునాయుడు వల్లనే సాధ్యమవుతుందని, తమ పార్టీ అభ్యర్థులను ఆదరించాలని కోరుతూ ప్రచారం చేసుకుంటున్నారు.

గూడూరు పట్టణంలోని...

## వికలాంగులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వికలాంగులు

గూడూరు పట్టణంలోని వికలాంగులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని దళిత అభ్యుదయ సేవా సమితి (దాస్) గూడూరు నియోజక వర్గ అధ్యక్షుడు వల్లి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. దాస్ యువర్ హెల్ప్ వికలాంగుల స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం వికలాంగులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారు 1500మంది వికలాంగులు ఉన్నారని, వారందరికీ అన్ని ప్రభుత్వ పథకాల అమలులో 3శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.

పట్టణానికి సమీపంలో ఓ కార్పొరేట్ కళాశాల యజమాన్యం ఆక్రమణలో ఉన్న సర్వే నెంబరు 850, 945, 949లో ఉన్న 2.40ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఉందని, ఆ భూమిలో అధికారులు వికలాంగులకు ఇళ్లస్థలాలకు పట్టాలుగా ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ, రమణయ్య, ఖాదర్‌భాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన న్యాయమూర్తులకు సన్మానం

గూడూరు కోర్టులో పనిచేస్తూ బదలీపై వెళుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజారాం, అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ పి.మురళీధర్‌ను గూడూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ.సాయికుమార్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం రాత్రి కోర్టు ఆవరణంలో సన్మానించారు. రాజారాం బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, మురళీధర్ నగరి అడిషనల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్‌గా బదలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో 7వ అదనపు జిల్లా జడ్జి గుర్రప్ప, నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దివాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!



రాష్ట్ర మాజీ ఆర్థికశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి -శైలజ కుమార్తె **లీలాకైవల్య - రితేష్‌కుమార్‌రెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు డా॥ కొండ్రెడ్డి రవికుమార్‌రెడ్డి - విజయలక్ష్మిల కుమారుడు)ల వివాహం ఈ నెల 4వ తేదీ హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్‌లో వైభవంగా జరిగింది. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులతో చిరంజీవి



దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న విక్టరీ వెంకటేష్



కొత్తజంటను ఆశీర్వదిస్తున్న టీఎస్సార్



నూతన దంపతులను దీవిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

# అదే విజయపరంపర

## -- నమ్మకాన్ని వమ్ము చేయని పిఎస్ఎల్‌వి సిరీస్ --



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)కు నమ్మకమైన అస్త్రం పీఎస్ఎల్‌వి సిరీస్. ఈ సిరీస్‌లో రాకెట్ వదులుతున్నారంటే ఇస్రో ఖాతాలో మరో విజయం నమోదైనట్లే. పిఎస్ఎల్‌వి మరోసారి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంది. ఈ నెల 4వ తేదీన శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన పీఎస్ఎల్‌వి-సి24 పూర్తి స్థాయిలో విజయవంతమైంది. భారత ప్రాంతీయ దిశానిర్దేశ ఉపగ్రహ వ్యవస్థ శ్రేణిలోని రెండో ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్-1బిని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది.

ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5గంటలకే షార్ ప్రాంగణం అంతా అలర్ట్ అయ్యింది. అందరిచూపులు ఆకాశం వైపే. సరిగ్గా 5.14గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ పిఎస్ఎల్‌వి-సి24 నింగికేసి దూసూకుపోయింది. ప్రయోగం జరిగిన 19.26నిముషాల తర్వాత ఐఆర్ఎన్ఎస్ఎస్-1బి ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆ వెంటనే ఉపగ్రహం సౌరఫలకాలు విచ్చుకోవడంతో కంట్రోల్‌రూంలో వున్న శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకర్నొకరు కౌగిలించుకుని అభినందనలు తెలుపుకున్నారు.

ఈ ప్రయోగానికి ఇస్రో 225కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. రాకెట్ తయారీకి 125కోట్లు, ఉపగ్రహం తయారీకి 100కోట్లు ఖర్చయ్యాయి. మొత్తం నాలుగుదశలలో ఈ ప్రయోగం జరిగింది. మొదటి, మూడు దశల్లో ఘన ఇంధనాన్ని, రెండు, నాలుగో దశలలో ద్రవ ఇంధనాన్ని వాడారు. ఈ ప్రయోగం కోసం పిఎస్ఎల్‌వికి చెందిన ఎక్స్‌వెల్ వెర్షన్ ఉపయోగించారు. ఇందులో ఆరు మోటార్లు ఉంటాయి.

ఇక ఉపగ్రహం తయారీలో 140 మంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు పాల్గొన్నారు. సైంటిస్ట్ ముప్పాళ్ళ నాగేశ్వరరావు నేతృత్వంలో ఈ ఉపగ్రహం తయారీ జరిగింది. ఈ ఉపగ్రహం భూ, వాయు, జల మార్గాలకు స్థితి, స్థాన, దిక్కులను తెలియజేస్తుంది. ఖచ్చితమైన సమయాన్ని కూడా సూచిస్తుంది. ఆపద సమయాలలో సహాయచర్యలు, రవాణా వాహనాల ఉనికి, భూగోళానికి సంబంధించిన విషయాలను కనుగొనడానికి దోహదపడుతుంది. వాహన చోదకులకు దృశ్య, శ్రవణ విధానాలలో దిశా నిర్దేశం చేస్తుంది. ఈ ఉపగ్రహా నికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించడం విశేషం.

# బీదకు ఒక్కటే ఖరారు

## మిగతా వాటిపై తకరారు



తెలుగుదేశంపార్టీ తొలిజాబితాలో కావలి సిట్టింగ్‌ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు ఒక్కడికే స్థానం దక్కింది. కావలి సీటును తిరిగి ఆయనకే ఖరారు చేసారు. దీంతో మిగతా సీట్లపై సందిగ్ధత నెలకొంది. కావలి సీటు విషయంలో మరో ఆలోచన లేకపోవడంతో బీద అభ్యర్థిత్వం ఖరారైంది. మిగతా అన్ని సీట్లలో స్పష్టత రాలేదు. నెల్లూరు నగరం సీటును ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికే ఖాయంగా చెబుతున్నా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా పట్టుబడుతున్నారు. నెల్లూరు రూరల్ బీజేపీకే వదిలేస్తారా లేక మారుస్తారా అనే దాని మీద కూడా సందేహాలున్నాయి. సర్వేపల్లి నుండి పోటీ చేసేదానికి ఎవరూ ముందుకు రావడం లేదు. గూడూరు సీటును సిట్టింగ్ ఎమ్మెల్యేగా బల్లి దుర్గాప్రసాద్‌రావుకే ఇవ్వాలా లేక ఆయన కొడుకును దించాలా అనేది పరిశీలన జరుగుతుంది. గూడూరు తెలుగుదేశం అభ్యర్థిగా కాంగ్రెస్ నాయకుడు పనబాక కృష్ణయ్య పేరు కూడా ప్రచారంలో వుంది. సూళ్లూరుపేటలో సిటింగ్ ఎమ్మెల్యే పరసారత్నంను మార్చే అవకాశాలున్నాయి. ఇక్కడ మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యంతో పాటు ఇంకొందరి పేర్లు కూడా వినవస్తున్నాయి. వెంకటగిరికి సిటింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకే ఇస్తారా లేక కాంట్రాక్టర్ గంగాప్రసాద్ ఇక్కడనుండి నిలబడతాడా అనేది తేలడం లేదు. కోవూరు కోసం పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిల మధ్య యుద్ధం జరుగుతూనే వుంది. ఆత్మకూరుకు కూడా ఇంకా అభ్యర్థి అన్వేషణ జరుగుతూనే వుంది. ఉదయగిరికి బొల్లినేని రామారావు వున్నా మరోపేరు కూడా పరిశీలనలో వుంది. మొత్తానికి ఇంకో నాలుగైదు రోజుల్లో అన్ని స్థానాలలో అభ్యర్థులను ఓ కొలిక్కి తేక తప్పదు.

# రూరల్‌లో బాబాయ్ నగరంలో అబ్బాయ్





జిల్లా రాజకీయాలలో ఆనం కుటుంబాన్ని ప్రస్తుతం అగ్రభాగాన నిలిపిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఇక ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగే అవకాశాలు కనిపించడం లేదు. ఆయన ఎన్నికల బరి నుండి తప్పుకుని తన సోదరుడికి, కుమారుడికి అవకాశం కల్పిస్తున్నారు. రేపటి ఎన్నికల్లో నెల్లూరురూరల్ కాంగ్రెస్ అభ్యర్థిగా వివేకా తమ్ముడు ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు నగరం కాంగ్రెస్ అభ్యర్థిగా వివేకా పెద్దకొడుకు ఆనం చెంచుసుబ్బారెడ్డి రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తుంది. ఈమేరకు అనుచరులతో మంతనాలు కూడా జరిపారు.

రాష్ట్రంలోనే కాదు వీళ్ల పోటీ చేయబోయే స్థానాలలో కూడా కాంగ్రెస్‌కు ప్రతికూల వాతావరణం వుంది. ఎంత ఆనం బ్రాండ్ ఇమేజ్ వున్నా కాంగ్రెస్ వ్యతిరేకతను అధిగమించలేదు. ఈ ఎన్నికలతో కాంగ్రెస్ అభ్యర్థులుగా దిగడం సాహసమే అయినా, పార్టీని మార్చకూడదనే ఉద్దేశ్యమే ప్రధానంగా వారు పోటీకి సిద్ధమవుతున్నారు.




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.